RNI No. APTEL/2012/53127

TELANGANA VANI TELUGU DAILY

# తెలంగాణ వాణి

తెలుగు దినపత్రిక | The Voice of Telangana

Published From KARIMNAGAR, HYDERABAD, ADILABAD, NIZAMABAD, WARANGAL, KHAMMAM, NALGONDA,

సంపుటి: 15 | సంచిక: 380 | ఎడిటర్ : జేరిపోతుల సంపత్, కరీంనగర్ | గురువారం 16-4-2026 | పేజీలు: 8 | వెల: రూ. 2.00

తెలంగాణ వాణి TELANGANA VANI TELUGU DAILY తెలుగు దినపత్రిక R N I No. APTEL/2012/53127 The Voice of Telangana

విలేకరులు కావలెను

తెలంగాణ వాణి దినపత్రికలో పనిచేయుటకు సిటీ బ్యూరో, జిల్లా బ్యూరోలు, నియోజకవర్గం, మండలాలవారీగా అనుభవం కలిగిన రిపోర్టర్లు కావలెను. ఆసక్తిగలవారు ఈ క్రింది నెంబరుకు సంప్రదించగలరు.

9182328292

## మీ సేవ సెంటర్లలో భారీగా అక్రమాలు

**- దళారుల ఆగడాలు.. ఏసీబీ దాడులు**

**హైదరాబాద్** హైదరాబాద్‌లో మీ సేవ కేంద్రాలపై అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు బుధవారం రోజున ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. నగరంలోని పలు మీ సేవ కార్యాలయాల్లో ఏకకాలంలో సోదాలు చేపట్టారు. మీ సేవ కేంద్రాల్లో జరుగుతున్న అక్రమాలపై ఏసీబీ అధికారులు కొరడా ఝుళిపిస్తున్నారు. నగరంలోని ఖైరతాబాద్, అల్వాల్, అంబర్‌పేట్ ప్రాంతాల్లో ఉన్న కొన్ని మీ సేవ సెంటర్లలో అధికారుల సోదాలు కొనసాగాయి. ప్రభుత్వం తరపు నుంచి పౌరులకు జారీ చేయాల్సిన ధృవపత్రాల విషయంలో పెద్ద ఎత్తున అక్రమాలు జరుగుతున్నాయని ఫిర్యాదులు వెల్లువెత్తడంతో ఏసీబీ యాక్షన్‌లోకి దిగింది. ఈ క్రమంలోనే ఏసీబీ అధికారుల దాడుల సందర్భంగా సంచలన విషయాలు వెలుగులోకి వచ్చాయి. సాధారణ ప్రజలకు ప్రభుత్వం నుంచి అందాల్సిన సేవలను అందకుండా చేస్తున్నారని గుర్తించారు. దళారుల ద్వారా మీ సేవ నిర్వాహకులు, సిబ్బంది కలిసి చక్రం తిప్పుతున్నట్లు ప్రాథమికంగా తేలింది. కులం, ఆదాయం, నివాస ధృవీకరణ పత్రాల కోసం రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిన ఫీజు కంటే ఎక్కువ మొత్తాన్ని ప్రజల నుంచి వసూలు చేస్తున్నట్లు ఆరోపణలు రాగా వాటిపైనా ఏసీబీ అధికారులు దృష్టి పెట్టారు. ప్రజలు నేరుగా మీ సేవ కేంద్రాలకు వెళ్లి కావాల్సిన సర్టిఫికెట్ల కోసం

2లో..

# కాంగ్రెస్ నేతలకు పదవుల జాతర

**- నామినేటెడ్ పోస్టుల భర్తీకి సన్నాహాలు పూర్తి**

**హైదరాబాద్** తెలంగాణ కాంగ్రెస్ పార్టీలో గత కొద్దిరోజులుగా నెలకొన్న అంతర్గత పరిణామాలు, పాలనాపరమైన నిర్ణయాలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బుధవారం తన నివాసంలో అత్యంత కీలకమైన సమీక్ష నిర్వహించారు. రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్చార్జ్ మీనాక్షి నటరాజన్ , టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ ఈ భేటీలో పాల్గొన్నారు. దాదాపు నాలుగు గంటల పాటు సుదీర్ఘంగా సాగిన ఈ సమావేశంలో పార్టీ సంస్థాగత బలోపేతం, ప్రభుత్వ పథకాల అమలులో సమన్వయం, నామినేటెడ్ పదవుల భర్తీపై ప్రధానంగా చర్చ జరిగినట్లు సమాచారం.

### నామినేటెడ్ పోస్టుల కోసం డిమాండ్లు

ఈ భేటీలో అత్యంత ప్రాధాన్యత సంతరించుకున్న అంశం నామినేటెడ్ పదవుల భర్తీ . గత కొంతకాలంగా పార్టీ కోసం కష్టపడిన సీనియర్ నాయకులు, ద్వితీయ శ్రేణి కార్యకర్తలు పదవుల కోసం ఎదురుచూస్తున్నారు. మరో రెండు రోజుల్లోనే పెండింగ్‌లో ఉన్న కీలకమైన నామినేటెడ్ పోస్టులను భర్తీ చేయాలని ముఖ్యమంత్రి నిర్ణయించినట్లు తెలుస్తోంది. సామాజిక సమీకరణాలు, ప్రాంతీయ ప్రాతినిధ్యం దెబ్బతినకుండా జాబితాను సిద్ధం చేయాలని సీఎం పార్టీ నేతలకు సూచించారు. ఇది కార్యకర్తలలో కొత్త ఉత్సాహాన్ని నింపుతుందని అధిష్టానం భావిస్తోంది.



### అసంతృప్తి స్వరాలపై ఆరా తీసిన మీనాక్షి

పార్టీలో అక్కడక్కడా వినిపిస్తున్న అసంతృప్తి స్వరాలపై కూడా మీనాక్షి నటరాజన్ ఈ సందర్భంగా ఆరా తీశారు. కొందరు సీనియర్ నేతలు ప్రభుత్వ నిర్ణయాలపై బహిరంగంగా చేస్తున్న వ్యాఖ్యలు, సమన్వయ లోపంపై చర్చించారు. అందరినీ కలుపుకుని వెళ్లాలని, జిల్లాల వారీగా పార్టీ నేతలతో నిరంతరం టచ్‌లో ఉండాలని టీపీసీసీ అధ్యక్షుడికి సీఎం సూచించారు. ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లడంలో పార్టీ కేడర్ క్రియాశీలకంగా వ్యవహరించాలని

2లో..

## బలవంతపు భూసేకరణ ఆపకపోతే ఉద్యమం ఉధృతం

- అన్నదాతల పొట్ట కొట్టడం అన్యాయమన్న కవిత
- కాంగ్రెస్ పాలనలో రైతులకు రైతు భరోసా లేదు, ఆర్థిక సాయం లేదు
- రైతుల సమ్మతి లేకుండా ఒక్క ఎకరా భూమి కూడాం తీసుకోవడానికి వీల్లేదన్న కవిత



**హైదరాబాద్** పారిశ్రామికీకరణ పేరుతో పరిగి ప్రాంత రైతుల నుంచి బలవంతంగా సాగు భూములను లాక్కుంటున్నారంటూ తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, మాజీ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ప్రత్యక్ష పోరాటానికి దిగారు. వికారాబాద్ ఆర్డీవో కార్యాలయం వద్ద వందలాది మంది రైతులతో కలిసి ఆమె భారీ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రోడ్డుపై బైఠాయించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ, భూసేకరణ నోటిఫికేషన్‌ను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. తాతల కాలం నాటి సారవంతమైన భూములను నమ్ముకుని బతుకుతున్న అన్నదాతల పొట్ట కొట్టడం అన్యాయమని కవిత ఈ సందర్భంగా మండిపడ్డారు. రైతుల సమ్మతి లేకుండా ఏ ఒక్క ఎకరా భూమిని తీసుకోవడానికి వీల్లేదని, ప్రభుత్వం తన మొండివైఖరిని వీడకపోతే ఈ పోరాటాన్ని రాష్ట్రవ్యాప్తంగా ఉధృతం చేస్తామని హెచ్చరించారు. పారిశ్రామికీకరణ ముసుగులో భూసేకరణకు పాల్పడుతున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని ఆమె డిమాండ్ చేశారు. కవిత పిలుపుతో ఈ ఆందోళనలో స్థానిక నాయకులు, తెలంగాణ జాగృతి కార్యకర్తలు, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొనడంతో వికారాబాద్ పరిసరాల్లో

2లో..

## రేవంత్ రెడ్డిపై కాంగ్రెస్ పార్టీ పట్టు కోల్పోయింది

- **కాంగ్రెస్ పార్టీని రేవంత్ రెడ్డి ఖతం చేస్తున్నాడని ఆగ్రహం**
- **రేవంత్ రెడ్డి లాంటి వ్యక్తి కేసీఆర్ కాదన్న జీవన్ రెడ్డి**
- **కేసీఆర్‌కు ప్రజలు అంటే గౌరవం ఉందని వ్యాఖ్య**



**హైదరాబాద్** కాంగ్రెస్ పార్టీ, జీవన్ రెడ్డి మధ్య మాటల యుద్ధం ఆగడం లేదు. పార్టీకి గుడ్‌బై చెప్పిన జీవన్ రెడ్డి త్వరలోనే కారెక్కేందుకు రెడీ అవుతున్న వేళ తన మాటల దాడిని మరింత పెంచారు. అదే సమయంలో అధికార కాంగ్రెస్ పార్టీ కూడా ఏ మాత్రం వెనక్కి తగ్గకుండా జీవన్ రెడ్డి లక్ష్యంగా విమర్శలు గుప్పిస్తోంది. ఈ క్రమంలోనే మంగళవారం జగిత్యాల కాంగ్రెస్ నేతలతో సమావేశమై చర్చించిన సీఎం రేవంత్ రెడ్డి జీవన్ రెడ్డిపై విమర్శలు చేశారు. 4 దశాబ్దాలుగా కార్యకర్తలను తన వెంట తిప్పుకుని ఇప్పుడు మోసం చేసి బీఆర్ఎస్‌లోకి వెళ్తున్నారని మండిపడ్డారు. అదే సమయంలో జీవన్ రెడ్డికి తాము పార్టీలో ఎలాంటి లోటు చేయాలేదని స్పష్టం చేశారు. అయితే సీఎం వ్యాఖ్యలకు తాజాగా జీవన్ రెడ్డి కౌంటర్ ఇచ్చారు. జగిత్యాల జిల్లా రాయికల్‌లో జరిగిన కాంగ్రెస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో జీవన్ రెడ్డి తన ఆవేదనను వెళ్లగక్కారు. రేవంత్ రెడ్డి కాంగ్రెస్ పార్టీలోకి ఒక ఉడుం లాగా చొచ్చుకొచ్చారని జీవన్ రెడ్డి తీవ్రంగా విమర్శించారు. రేవంత్ రెడ్డి రావడంతోనే కాంగ్రెస్ పార్టీలో ఒక గీత గీసుకున్నారని పార్టీలో ఉన్న నేతలను ఎలా తొక్కాలి ఒక్కో మెట్టు ఎలా ఎక్కాలి అనేదే టార్గెట్‌గా పనిచేశారని మండిపడ్డారు. గత 40 ఏళ్లుగా కాంగ్రెస్ పార్టీని నమ్ముకుని ఉన్న తనను నేరుగా బయటికి పొమ్మనలేక పొగబెట్టారని జీవన్ రెడ్డి తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలను, క్రమశిక్షణను రేవంత్ రెడ్డి తుంగలో తొక్కారని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇక రాహుల్ గాంధీ నాయకత్వంపైనా జీవన్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. దేశవ్యాప్తంగా భారత్ జోడో పాదయాత్ర చేసిన రాహుల్ గాంధీ తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల్లో కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకొచ్చారని గుర్తు చేశారు. కానీ ఈ 2 రాష్ట్రాలే రాహుల్ గాంధీని ప్రధానమంత్రి కాకుండా అడ్డుకున్నాయని సంచలన ఆరోపణలు చేశారు. తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల్లో కాంగ్రెస్ పార్టీ ఆశించిన ఫలితాలు సాధించి ఉంటే నేడు భారత ప్రధానిగా రాహుల్ గాంధీ ఉండే వారని అభిప్రాయం వ్యక్తం చేశారు. పార్టీలోని స్వార్థ రాజకీయాలు, అంతర్గత కుమ్ములాటలే ఈ పరిస్థితికి కారణమని జీవన్ రెడ్డి తీవ్రంగా మండిపడ్డారు. ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీలోకి కొంతమంది నాయకులు జంప్ చేస్తారని కానీ తాను మాత్రం ప్రజల

2లో..

## కేసీఆర్ మాస్ వార్నింగ్

- **డీలిమిటేషన్ పై కేంద్రానికి స్ట్రాంగ్ మెసేజ్**
- **మహిళా రిజర్వేషన్ బిల్లుకు కేసీఆర్ సంపూర్ణ మద్దతు**
- **డీలిమిటేషన్ బిల్లును పరిశీలించాకే నిర్ణయం ఉంటుందని వెల్లడి**
- **దక్షిణాది రాష్ట్రాల ప్రయోజనాల విషయంలో రాజీపడబోమని వెల్లడి**



**హైదరాబాద్** మహిళా రిజర్వేషన్ల పట్ల తమ సంపూర్ణ మద్దతును ప్రకటిస్తూనే, దాని ముసుగులో దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం చేసే 'డీలిమిటేషన్' ప్రక్రియపై మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ అప్పట్లోనే(2023) తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. మహిళా సాధికారతకు తాము ఎప్పుడూ పెద్దపీట వేస్తామని, 2011లోనే అసెంబ్లీలో దీనిపై తీర్మానం చేశామని గుర్తుచేసిన ఆయన.. డీలిమిటేషన్ విషయంలో మాత్రం కేంద్రం అనుసరించబోయే వ్యూహంపై గట్టి హెచ్చరికలు జారీ చేశారు. జనాభా ప్రాతిపదికన నియోజకవర్గాల పునర్విభజన చేపడితే, అభివృద్ధిలో దూసుకుపోతున్న దక్షిణాది రాష్ట్రాలకు అది శాపంగా మారుతుందని కేసీఆర్ ఆందోళన వ్యక్తం చేశారు. గతంలో కేటీఆర్, హరీష్‌రావులతో నిర్వహించిన కీలక భేటీలో ఆయన ఈ అంశంపై పూర్తి క్లారిటీ ఇచ్చారు. దేశాభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్న రాష్ట్రాల గొంతు నొక్కేలా సీట్ల కేటాయింపు ఉంటే సహించే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు.ప్రస్తుతం లోక్‌సభలో దక్షిణాది రాష్ట్రాలకు సుమారు 24 శాతం ప్రాతినిధ్యం ఉంది. ఒకవేళ 2011 జనాభా లెక్కల ప్రకారం సీట్లు పెంచితే, ఈ వాటా తగ్గిపోయి ఉత్తరాది రాష్ట్రాల ఆధిపత్యం పెరుగుతుందని కేసీఆర్ లెక్కలతో వివరించారు. దక్షిణాది సీట్ల శాతం తగ్గకుండా, ప్రస్తుతం ఉన్న స్థానాలను కనీసం 50 శాతం పెంచాలని ఆయన డిమాండ్ చేశారు. బిల్లులోని ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాతే బీఆర్ఎస్ తన నిర్ణయాన్ని ప్రకటిస్తుందని,

2లో..

## ఏఐతో చర్మ క్యాన్సర్ స్క్రీనింగ్

**- స్వీడన్ పరిశోధనలో వెల్లడి**

**న్యూఢిల్లీ** ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) సహాయంతో ప్రాణాంతక చర్మ క్యాన్సర్‌లలో ఒకటైన మెలనోమా ముప్పును ముందుగానే గుర్తించవచ్చని స్వీడన్‌లో జరిగిన ఒక కొత్త అధ్యయనం తేల్చింది. ఆరోగ్య వ్యవస్థల్లో ఇప్పటికే అందుబాటులో ఉన్న డేటాను విశ్లేషించడం ద్వారా ఈ ఘనత సాధించవచ్చని పరిశోధకులు బుధవారం వెల్లడించారు. ఈ అధ్యయనం కోసం స్వీడన్‌లోని దాదాపు 60 లక్షల మంది వయోజన జనాభాకు

2లో..



## 3 రోజులు ఆరంజ్ అలెర్ట్

- **పలు ప్రాంతాల్లో 43 డిగ్రీలు దాటిన ఉష్ణోగ్రతలు**
- **వడగాలులు వీచే జిల్లాలకు ఎల్లో హెచ్చరికలు జారీ**

2లో..



## 'దళిత రత్న' అవార్డు అందుకున్న జర్నలిస్ట్ శరత్

**అభినందించిన మంత్రి పొన్నం ప్రభాకర్**



హుస్నాబాద్ (తెలంగాణ వాణి ప్రతినిధి) హుస్నాబాద్‌కు చెందిన పాత్రికేయుడు ఆరె శరత్‌కు ప్రతిష్టాత్మక "ఉత్తమ జర్నలిస్ట్ దళిత రత్న" అవార్డు లభించింది. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన అంబేద్కర్ జయంతి ఉత్సవాల సందర్భంగా హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో మంగళవారం రాత్రి జరిగిన కార్యక్రమంలో ఈ అవార్డును ప్రదానం చేశారు.గత దశాబ్దంగా జర్నలిజం రంగంలో ప్రత్యేక గుర్తింపు పొందిన శరత్, సామాజిక న్యాయం, దళితుల హక్కులు, గ్రామీణ సమస్యలు, సామాన్య ప్రజల కష్టాలను వెలుగులోకి తీసుకువస్తూ ప్రజా స్వరంగా నిలుస్తున్నారు. ఆయన సేవలను గుర్తించి ఈ పురస్కారాన్ని అందజేశారు.అంబేద్కర్ జయంతి ఉత్సవ కమిటీ చైర్మన్ అల్లిబిల్లి మహేందర్ చేతుల మీదుగా శరత్ అవార్డు స్వీకరించారు.కార్యక్రమంలో జాతీయ మాలమహానాడు హుస్నాబాద్ నియోజకవర్గ ఇంచార్జి ఆరె కిశోర్‌తో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.అవార్డు అనంతరం హైదరాబాద్‌లోని మంత్రి క్వార్టర్స్‌లో రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను శరత్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రి శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. సమాజానికి ఉపయోగపడే విధంగా జర్నలిజం కొనసాగిస్తూ భవిష్యత్తులో మరిన్ని పురస్కారాలు అందుకోవాలని ఆకాంక్షించారు.ఈ సందర్భంగా తనకు అవార్డు ప్రదానం చేసిన రాష్ట్ర ప్రభుత్వానికి, సహకరించిన జాతీయ మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షులు పిల్లి సుధాకర్, ప్రధాన కార్యదర్శి వెన్న రాజులకు శరత్ కృతజ్ఞతలు తెలిపారు.

## గుంటూరుపల్లి గ్రామ సభలో హెల్మెట్ తప్పనిసరి తీర్మానం

**ఉచితంగా హెల్మెట్ల పంపిణీ**




హసన్ పర్తి (తెలంగాణ వాణి ప్రతినిధి) హసన్‌పర్తి మండలం గుంటూరుపల్లి గ్రామ పంచాయతీ గ్రామ సభలో గ్రామ సర్పంచ్ చల్లా రాకేష్ రెడ్డి ఆధ్వర్యంలో గ్రామంలో ద్విచక్ర వాహనాలు కలిగిన ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించి ప్రయాణం చేయాలని తీర్మానించారు.ఈ తీర్మానాన్ని అమలు చేయడంలో భాగంగా సర్పంచ్ చల్లా రాకేష్ రెడ్డి ఉచితంగా హెల్మెట్లను అందజేశారు.ఈ హెల్మెట్లను కాజీపేట ఏసీపీ పింగిలి ప్రశాంత్ రెడ్డి గుంటూరుపల్లి ద్విచక్ర వాహన యజమానులకు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో హసన్‌పర్తి ఇన్‌స్పెక్టర్ చేరాలు, ఎస్సై దేవేందర్, ఉప సర్పంచ్, పంచాయతీ రాజ్ ఏఈ, గ్రామ కార్యదర్శి,గ్రామంలోని యువకులు, మహిళలు పాల్గొన్నారు.ఈ కార్యక్రమం ద్వారా రోడ్డు భద్రతపై గ్రామస్థులకు అవగాహన కల్పించడంతో పాటు హెల్మెట్ వినియోగంపై ప్రాధాన్యతను తెలియజేశారు.

## క్షయ వ్యాధి నివారణ అందరి బాధ్యత.



ఇబ్రహీంపట్నం ఏప్రిల్ 15 (తెలంగాణ వాణి విలేకరి) జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డాక్టరు ఎల్ వనజ ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యురాలు ఆధ్వర్యంలో టిబి క్యాంపు నిర్వహించబడింది కార్యక్రమంలో క్షయ వ్యాధి నివారణకై ప్రతి ఒక్కరూ తమ బాధ్యత గా కృషి చేయాలని జిల్లా ఉప వైద్యాధికారి డాక్టర్ ఎన్ శ్రీనివాస్ తెలిపారు ఈ సందర్భంగా ఆరోగ్య కేంద్రంలో ప్రత్యేకంగా డిజిటల్ మొబైల్ ఎక్స్ రే మిషన్ సహాయం తో. 78 మందికి పరీక్షలు నిర్వహించారు. దగ్గు జ్వరం బరువు తగ్గడం ఆకలి లేకపోవడం వంటి టీబీ అనుమానిత లక్షణాలు కలిగిన రోగులను తేమడ పరీక్షలు ఎక్స్ రే పరీక్షలు నిర్వహించారు ఈ కార్యక్రమం లో సర్పంచ్ బద్దం గోపి,ఉప సర్పంచ్ నాంపల్లి రమేష్ ప్రాథమిక ఆరోగ్య కేంద్ర సిబ్బంది ఆశా వర్కర్లు ఆంజనేయులు రేడియోగ్రఫరూ వికాస్ డిపిఎం హరీష్ తదితరులు పాల్గొన్నారు.

## ఉమ్మడి జిల్లా టాపర్ గా గురుకులం విద్యార్థిని.



ఇబ్రహీంపట్నం ఏప్రిల్ 15 (తెలంగాణ వాణి విలేకరి) జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండల కేంద్రానికి చెందిన శ్రీపాద వైష్ణవి ఎం జె పి కళాశాల జిల్లా టాపర్ ర్యాంకర్ గా నిలిచింది. జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండల కేంద్రం కి చెందిన వైష్ణవి జ్యోతిబా పూలే సిరిసిల్ల కళాశాలలో ఇంటర్ ఎంపీసీ ఫస్టియర్ చదువుతుంది లక్షిపూర్ గురుకులంలో పదో తరగతి చదివిన వైష్ణవికి ఇంటర్ సిరిసిల్ల గురుకుల కళాశాల లో సీటు లభించింది తల్లితండ్రులు సాధరణ స్వర్ణకార కుటుంబానికి చెందిన శ్రీపాద వీణ ధర్మరాజు లా కూతురు అయిన వైష్ణవి ప్రభుత్వ పాఠశాలలో చదివి ర్యాంక్ సాధించడం ఆ కుటుంబంలో సంతోషానికి అవధులు లేకుండా పోయింది సిరిసిల్ల కళాశాల పెద్దపల్లిలో తరగతులు నిర్వహిస్తుండగా అక్కడ శ్రద్ధతో చదివిన వైష్ణవి ఇంటర్ ఫస్టియర్ లో 470 కి 468 మార్కులు సాధించి ఉమ్మడి జిల్లా టాపర్ గా నిలిచింది ర్యాంకుల సాధించింది ప్రైవేట్ కళాశాలల జోలికి పోకుండా ప్రభుత్వ కళాశాలలో చదివి టాపర్ గా నిలిచిన వైష్ణవిని మండల ప్రజలు అభినందించారు.

# సంభాషణ, ప్రభావంపై గీతంలో కార్యశాల



పటాన్ చెరు, ఏప్రిల్ 15, (తెలంగాణ వాణి రిపోర్టర్) గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం లోని విద్యా ఆవిష్కరణ, పురోగతి కేంద్రం (సీఏఐఏ) ఏప్రిల్ 21 న ఉదయం 9.00 నుంచి సాయంత్రం 5.00 గంటల వరకు 'సంభాషణ, ప్రభావం'పై ఒక రోజు స్వీయ నైపుణ్యాల పెంపుదల కార్యశాలను నిర్వహించనుంది.సీఏఐఏకు చెందిన మోసెస్ కొటికెల ప్రకారం, విద్యా వాతావరణాలలో ఒక కీలకమైన నాయకత్వ సామ ర్థ్యాన్ని, అంటే, ప్రభావితం చేయగల సామర్థ్యంతో కూడిన సమర్థవంతమైన సంభాషణను బలోపేతం చేయడానికి ఈ కార్యక్రమం రూపొందించినట్టు తెలిపారు. ఈ నైపుణ్యాలు విశ్వవిద్యాలయ నాయకులకు విభిన్న భాగస్వాములను ఏకం చేయడానికి, విశ్వాసాన్ని పెంపొందించడానికి, సంస్థాగత దృక్పథాన్ని సమన్వయ చర్యలుగా మార్చడానికి వీలు కల్పిస్తాయన్నారు. సంక్లిష్టమైన విద్యా వ్యవస్థలలో మార్పును తీసుకురావడానికి, విభేదాలను పరిష్కరించడానికి, సహకారాన్ని పెంపొందించడానికి, వ్యక్తులను ప్రేరేపించడానికి కూడా ఇవి చాలా అవసరమని అభిప్రాయపడ్డారు.విశ్వ విద్యాలయం మేథోపరమైన గుర్తింపునకు బ్రాండ్ అంబాసిడర్లుగా నాయకులు పనిచేస్తారని గుర్తిస్తూ, అధ్యాపకులు, విద్యా నాయకులు తరగతి గదులు, సమావేశాలు, సహకారాలు, విద్యార్థుల కార్యక్రమాలలో సంస్థ ప్రాతినిధ్యాన్ని మెరుగుపరచడంపై ఈ కార్యశాల దృష్టి సారిస్తుందని తెలియజేశారు. ఈ కార్యశాలలో, ఉపన్యాసాలు, ప్రజెంటేషన్లు, విద్యా సంబంధ చర్చలను మరింత ఆసక్తికంగా, ప్రభావవంతంగా మార్చే లక్ష్యంతో 'అకడమిక్ ఇంపాక్ట్ కోసం కథలు చెప్పడం' అనే అంశంపై ఒక మాస్టర్ క్లాస్ ఉంటుందన్నారు. ఇందులో పాల్గొనేవారు జాతీయ, అంతర్జాతీయ విద్యా వేదికలలో సంస్థాగత బలాలను స ప ం ర్ధ ప ం త ం గా వ్యక్తీకరించడం, ప్రదర్శించడం కూడా నేర్చుకుంటారని వివరించారు. దీనికి అదనంగా, ఈ కార్యక్రమం తరగతి గదిలో భాగస్వామ్యాన్ని పెంచడానికి, విషయ నైపుణ్యానికి అతీతంగా అభ్యాస అనుభవాలను సుసంపన్నం చేయడానికి ఆచరణాత్మక వ్యూహాలను పరిచయం చేస్తుందని తెలిపారు. ఈ కార్యశాలలో కోహెన్-బ్రాడ్‌ఫోర్డ్ ప్రభావ నమూనాని అనువర్తించడం ఒక కీలక అంశంగా ఉంటుందన్నారు. ఇది విద్యా సంబంధిత కార్యక్రమాలలో సమన్వయం, విశ్వసనీయతను పెంపొందించడానికి, పాల్గొనే వారికి సానుభూతి పటాలు, ప్రభావ విలువలను అర్థం చేసుకోవడంలో సహాయపడుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమం సంస్థాగత సందర్భాలకు అనుగుణంగా చర్చలు, వాస్తవ జీవిత దృశ్యాలు, ఆత్మ పరిశీలన వ్యాయామాలను మిళితం చేస్తూ, అత్యంత ముఖాముఖిగా ఉంటుందన్నారు. ఐటీ, తయారీ, బీఎఫ్ఎస్ఐ, ఫార్మాస్యూటికల్స్, జీసీసీలు, విద్యారంగంతో సహా పలు రంగాలలో 26 సంవత్సరాలకు పైగా అనుభవం ఉన్న నాయకత్వం, ప్రవర్తనా సలహాదారు జూజర్ శుక్లా హస్తక్ ఈ కార్యశాలలో ప్రధాన వక్తగా పాల్గొంటారని తెలిపారు. వ్యక్తులు, సంస్థలు తమ అత్యున్నత సామర్థ్యాన్ని గ్రహించేలా చేయడంలో బలమైన దృష్టితో, ఆమె ఆచరణాత్మక అంతర్దృష్టులు, ప్రతిబింబిత అభ్యాస పద్ధతుల యొక్క విశిష్టమైన సమ్మేళనాన్ని తీసుకొస్తారని వివరించారు.

# చెన్నూర్ నియోజకవర్గ అభివృద్దే నా ధ్యేయం

మందమర్రి టౌన్ ఏప్రిల్ 15 (తెలంగాణ వాణి విలేకరి ) చెన్నూరు నియోజక వర్గ అభివృద్దే నా ధ్యేయమని నియోజక వర్గంలో ప్రతి ప్రాంతాన్ని అభివృద్ధి ప్రధం లో నడిపిస్తానని రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగార, గనులు భూగ ర్భ శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకట స్వామి పేర్కొన్నారు. బుధవారం మందమర్రి మున్సిపల్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, జిల్లా అదనపు కలెక్టర్ పి. చంద్రయ్య, మందమర్రి, క్యాతనపల్లి, చెన్నూర్ మున్సిపాలిటీల కమిష నర్లు రాజలింగు, మారుతి ప్రసాద్, మురలీకృష్ణ, సింగరేణి ఏరియా జనరల్ మేనేజర్ రాధాకృష్ణ లతో కలిసి మున్సిపల్ పరిధి లోని అభివృద్ధి పనుల నిర్వహణపై సమీక్ష సమావేశంనిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి మాట్లాడుతూ ప్రజల సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధి దిశగా ప్రభు త్వం అనేక పథకాలను అమలు చేస్తుందని తెలిపారు. మున్సిపల్ పరిధిలోని అంతర్గత రహదారులు, మురుగు కాలువల వ్యవస్థను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసి మున్సిపాలిటీని పరిశుభ్రంగా ఉంచాలని తెలిపారు. వేసవి అయి నందున ప్రజలకు అంత రాయం లేకుండా ప్రతి రోజు నీటిని సరఫరా చేసే విధంగా కార్యచరణ రూపొందించి అమలు చేయాలని తెలిపారు. ప్రభుత్వం చేపట్టిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా మున్సిపల్ అభి వృద్ధితో పాటు ప్రజా సమస్యల పరిష్కారం దిశగా ప్రత్యేక దృష్టి సారించాలని అధికారు లను ఆదేశించారు. మంద మర్రి మండల కేంద్రంలోని నైపుణ్య అభివృద్ధి కేంద్రా న్ని జిల్లా ఉపాధి కల్పన అధికారి రవికృష్ణ, ప్రభు త్వ ఐ.టి.ఐ. ప్రిన్సిపల్ దేవానంద్ లతో కలిసి సందర్శించారు. రాష్టం లోని నిరుద్యోగ యువత కు ఉపాధి కల్పించి అభి వృద్ధి చెందే దిశగా ప్రోత్స హించడం జరుగుతుందని తెలిపారు. టాంకామ్ ద్వారా విదేశాలలో ఉద్యో గావకాశాలు కల్పిం చడం జరుగుతుందని, జర్మనీలో ప్రతి సంవత్సరం 5 లక్షల ఉద్యోగుల అవసరం ఉందని, ప్రతి సంవత్సరం 90 వేల వీసాలు జారీ చేసేందుకు ఆ దేశం ముందుకు వచ్చిందని తెలిపారు. రాష్టంలో ప్రభుత్వం చేపట్టిన అధు నాతన సాంకేతిక కేంద్రాల (ఎ.టి.సి.)ద్వారా 25 వేల మంది యువతకు వివిధ కోర్సులలో నైపుణ్య అభి వృద్ధి శిక్షణ ఇవ్వడం జరు గుతుందని, ఇందుకోసం రాష్ట్ర ప్రభుత్వం 4 వేల కోట్ల రూపాయలు ఖర్చు పెడుతుందని తెలిపారు. టామ్ కామ్ ద్వారా 4 నెల ల్లో జర్మన్ భాష నేర్పించి ఉపాధి అవకాశాలు కల్పించడంజరుగుతుందని తెలిపారు. విదేశాలలో ఉపాధి కొరకు ప్రైవేటు ఏజెన్సీల మాటలు నమ్మి మోసపోవద్దని, విదేశాల్లో భారతీయ యువతకు విస్తృతమైన అవకాశాలు న్నాయని, టాంకాంద్వారా అర్హులైన నిరుద్యోగ యువ తకు విదేశాలలో ఉపాధి కల్పించడం జరుగుతుంద ని తెలిపారు.



ప్రభుత్వం రాష్ట్రంలోని నిరుద్యోగ యువతకు ఇప్పటికే లక్షకు పైగా ఉద్యోగాలు కల్పించిందని,టామ్ కామ్ కల్పిస్తున్న అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవా లని తెలిపారు.ఇదే తరహా లో అసంఘటిత రంగ కార్మికుల సంక్షేమంపై ప్రభుత్వం చర్యలు తీసు కుంటుందని తెలిపారు. అనంతరం రాష్ట్ర మంత్రి గడ్డం వివేకానంద, జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి. చంద్రయ్య ఐ.టి.ఐ.ప్రిన్సిపల్ దే వానంద్ లతో కలిసి మందమర్రిలోని ఎ.టి.సి. సెంటర్ ను సందర్శించా రు. ప్రభుత్వం పారిశ్రామిక శిక్షణ సంస్థలను మరింత అభివృద్ధి చేస్తూ అడ్వా న్స్డ్ టెక్నాలజీ సెంటర్లను ఏర్పాటు చేసి వివిధ వృత్తి విద్య కోర్సులలో శిక్షణ అందించి స్వయం ఉపాధి దిశగా నిరుద్యోగ యువత ను ప్రోత్సహించడం జరుగుతుందని తెలిపా రు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ బీసీ సంఘం తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షులుగా వేణుగోపాల్ యాదవ్

**ఆర్. కృష్ణయ్య చేతుల మీదుగా నియామక పత్రం అందజేత**

**బీసీ ల సమస్యల పైన ఎల్లవేళలా పోరాటకి సిద్ధంగా ఉండాలని పిలుపు**



ఆదిలాబాద్, ఏప్రిల్ : 15 ( తెలంగాణ వాణి ప్రతినిధి ) వేణుగోపాల్ యాదవ్ ను జాతీయ బీసీ సంఘం తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షులు గా ఎన్నికయ్యారు, జాతీయ అధ్యక్షుడు ఆర్ కృష్ణయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్ ర్యాగ అరుణ్ కుమార్ ల చేతుల మీదుగా నియామక పత్రాన్ని కార్యాలయంలో వేణుగోపాల్ యాదవ్ కు అందించారు , ఈ సందర్భంగా ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ రాష్ట్రంలో బీసీల బలోపేతానికి మరియు వారి అభివృద్ధికి , అలాగే బిసి సమస్యల పైన ఎప్పటికప్పుడు ఉద్యమిస్తూ పరిష్కారానికి కృషి చేయాలని అన్నారు,ఆదిలాబాద్ జిల్లాలలో గ్రామ స్థాయి నుండి జిల్లా స్థాయి వరకు పూర్తి కమిటీలు ఏర్పాటు చేసి సంఘాన్ని బలోపేతం చేయాలనీ అన్నారు, ఇటీవల మరణించిన ఉమ్మడి జిల్లా అధ్యక్షులు ఈర్ల సత్యనారాయణ కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతి వ్యక్తపరిచార.అనంతరం వేణుగోపాల్ యాదవ్ మాట్లాడుతూ తనపై నమ్మకం తో రాష్ట్ర ఉప అధ్యక్షులు గా నియమించిన సందర్భంగా దీనికి సహకరించిన జాతీయ అధ్యక్షులు కృష్ణయ్య కి, వర్కింగ్ ప్రెసిడెంట్ అరుణ్ కి జాతీయ యువజన అధ్యక్షులు కిషోర్ గారికి మరియు ఇతర బీసీ సంఘం నాయకులకు ధన్యవాదాలు తెలిపారు,

## మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

**వేములవాడ కమిషనర్‌కు ఏఐటీయూసీ విజ్ఞప్తి**



వేములవాడ,ఏప్రిల్ 15 (తెలంగాణ వాణి ప్రతినిధి) :రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ మున్సిపల్ కమిషనర్‌కు తెలంగాణ రాష్ట్ర మున్సిపల్ ఔట్ సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ అనుబంధం) ఆధ్వర్యంలో విజ్ఞాపన పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కడారి రాములు, అధ్యక్షుడు అజ్జ వేణు మాట్లాడుతూ 10వ పీఆర్సీ సిఫార్సుల ప్రకారం మున్సిపల్ కార్మికులకు కనీస వేతనం 26 వేల రూపాయలు ఇవ్వాలని మరియు కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ కార్మికులను తక్షణమే రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. కార్మికులకు పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాలతో పాటు హెల్త్ కార్డులు అందజేయాలని, జిల్లాలో ఈఎస్ఐ ఆసుపత్రిని నిర్మించి కార్మికులకు మెరుగైన వైద్యం అందుబాటులోకి తీసుకురావాలని వారు కోరారు.

## చిత్తడి నేలల గుర్తింపునకు చర్యలు వేగవంతం చేయాలి

**జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్**



నిర్మల్, ఏప్రిల్:15(తెలంగాణ వాణి ప్రతినిధి)జిల్లాలో చిత్తడి నేలల (వెట్‌ల్యాండ్స్) గుర్తింపు, అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ సంబంధిత అధికారులను ఆదేశించారు.బుధవారం సాయంత్రం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో చిత్తడి నేలలను శాస్త్రీయంగా గుర్తించి, వాటి అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. చిత్తడి నేలల అభివృద్ధి ద్వారా పర్యాటక అవకాశాలు పెరిగి, జిల్లాకు ఆర్థికంగా లాభం చేకూరుతుందని తెలిపారు. దీంతో స్థానికులకు ఉపాధి అవకాశాలు కూడా మెరుగుపడతాయని పేర్కొన్నారు.చిత్తడి నేలలు పర్యావరణ సమతుల్యతను కాపాడటంలో కీలక పాత్ర పోషిస్తాయని, జీవ వైవిధ్య పరిరక్షణకు అవి ఎంతో అవసరమని కలెక్టర్ వివరించారు. నిబంధనలకు అనుగుణంగా చిత్తడి నేలలను గుర్తించి, అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్, డిఎఫ్ఓ సుశాంత్ సుఖదేవ్ బోబడే, అటవీ, రెవెన్యూ, ఇరిగేషన్ శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఇంటర్ ఫలితాల్లో ప్రతిభ కనబరిచిన బాసర విద్యార్థులకు ఘన సన్మానం



బాసర (తెలంగాణ వాణి ప్రతినిధి) బాసర గ్రామానికి చెందిన పలువురు విద్యార్థులు ఇటీవల విడుదలైన ఇంటర్ పరీక్షల ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచారు. ఈ సందర్భంగా బాసర గ్రామ వీడీసీ సభ్యులు ఆ విద్యార్థులను ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో వీడీసీ సభ్యులు మాట్లాడుతూ, గ్రామ విద్యార్థులు మంచి ఫలితాలు సాధించడం గర్వకారణమని, భవిష్యత్తులో మరింత ఉన్నత లక్ష్యాలు సాధించాలని ఆకాంక్షించారు. విద్యార్థులకు పూలమాలలు వేసి శాలువాలు కప్పి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బాసర గ్రామ విడిసి అధ్యక్షుడు లింగారావు కమిటీ సభ్యులు,గ్రామ పెద్దలు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# కష్టపడిన కార్యకర్తలకు న్యాయం చేయాలి

**- డీసీసీ అధ్యక్షుడికి వినతి**



బోథ్ (తెలంగాణా వాణి ప్రతినిధి)ఆదిలాబాద్ జిల్లా బోథ్ మండలానికి చెందిన పార్టీ నాయకులు,కార్యకర్తలు బుధవారం జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) అధ్యక్షుడు నరేష్ జాధవ్‌ను కలిసి మండలంలోని ప్రస్తుత రాజకీయ పరిస్థితులు, పార్టీ నిర్మాణం,కార్యకర్తల సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా పార్టీ బలోపేతానికి అవసరమైన అంశాలను వివరించి వినతి పత్రం సమర్పించారు.పార్టీ పదవులు, నామినేటెడ్ పోస్టుల నియామకాల్లో స్థానిక నాయకత్వానికి ప్రాధాన్యత ఇవ్వాలని వారు గట్టిగా కోరారు. స్థానిక పరిస్థితులు బాగా తెలిసిన నాయకులు, కష్టపడే కార్యకర్తల సూచనలతో నిర్ణయాలు తీసుకుంటే పార్టీ మరింత బలపడుతుందని పేర్కొన్నారు.
ఇటీవల జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో,ముఖ్యంగా సర్పంచ్ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం కష్టపడ్డ కార్యకర్తలను గుర్తించి వారికి తగిన ప్రాధాన్యం ఇవ్వాలని తెలిపారు.కష్టపడిన వారికే పార్టీ పదవులు, నామినేటెడ్ పోస్టులు ఇవ్వడం ద్వారా కార్యకర్తల్లో నమ్మకం పెరుగుతుందని పేర్కొన్నారు.పార్టీకి అంకితభావంతో పనిచేసే కార్యకర్తలకే అవకాశాలు కల్పించాలని, పైరవీలు, వ్యక్తిగత అనుబంధాల ఆధారంగా పదవులు ఇవ్వడం పార్టీకి నష్టం కలిగిస్తుందని అభిప్రాయపడ్డారు. కాడర్‌ను గౌరవించి ప్రోత్సహించడం ద్వారానే పార్టీ బలోపేతం సాధ్యమని తెలిపారు.అలాగే పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డీసీసీ అధ్యక్షుడిని కోరారు.పార్టీకి నష్టం కలిగించే చర్యలను సహించబోమని స్పష్టం చేశారు.
పార్టీ కోసం ఐక్యతతో, క్రమశిక్షణతో పనిచేయాలని, వ్యక్తుల కంటే పార్టీ ముఖ్యమనే భావనతో ముందుకు సాగాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు.ఈ సమావేశం ద్వారా మండల సమస్యలు డీసీసీ అధ్యక్షుడి దృష్టికి వెళ్లాయని, త్వరలోనే తగిన చర్యలు తీసుకుంటారని ఆశాభావం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో ఆత్మ చైర్మన్ గొర్ల రాజు యాదవ్,మాజీ బ్లాక్ ప్రెసిడెంట్ మెరుగు నరసింహ దాస్,మాజీ ఎంపిటిసి మహేందర్,మాజీ ఎంపిటిసి ఓ ప్యాక్స్ డైరెక్టర్ చట్ల ఉమేష్, ఆత్రం సుశీల,సెక్రటరీ వినయ్ రెడ్డి,కుచ్లాపూర్ సర్పంచ్ నారాయణ,మర్లపెల్లి ఉప సర్పంచ్ రమేష్,మెరుగు బోజన్న, సాయన్న,ఆత్మ డైరెక్టర్ రహీం, మార్కెట్ డైరెక్టర్ అబ్రార్, సురేందర్,పోతా రెడ్డి,దినేష్ రెడ్డి, షామిందర్ రెడ్డి,అలపాటి అచ్యుతానంద్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# గజదొంగ టేకం తుకారంపై పిడి యాక్ట్ నమోదు

**ఉట్నూర్ సిఐ మడవి ప్రసాద్**



ఉట్నూర్( తెలంగాణ వాణి ) ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల్, కరీంనగర్, సిరిసిల్ల జిల్లాల పరిధిలో వరుస దొంగతనాలకు పాల్పడుతున్న గజదొంగ టేకం తుకారం పై ఉట్నూర్ పోలీసులు పిడి యాక్ట్ నమోదు చేశారు. నిందితుడు గత దాదాపు 10 సంవత్సరాలుగా వివిధ ప్రాంతాల్లో చోరీలకు పాల్పడుతూ, ఇప్పటివరకు సుమారు 44 దొంగతనం కేసుల్లో ప్రధాన నిందితుడిగా ఉన్నాడు. ఉట్నూర్ సీఐ మడావి ప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం, టేకం తుకారం దంతనపల్లి ఉట్నూరు మండలానికి చెందిన వ్యక్తి, గత కొన్ని సంవత్సరాలుగా దొంగతనాలకు పాల్పడుతూ ఉన్నాడని తెలిపారు. గతంలో ఇతనిపై 36 కేసులు నమోదు కాగా, అందులో దాదాపు 18 కేసుల్లో కోర్టు ద్వారా నేరం నిరూపణ పొంది జైలు శిక్షను అనుభవించారు. జైలు నుండి విడుదలైన తర్వాత ఈ మధ్యలో అతనిపై ఉట్నూర్ పోలీస్ స్టేషన్లో ఏడు కేసులు, మంచిర్యాల పోలీస్ స్టేషన్లో ఒక కేసు నమోదు అయినవని తెలిపారు. మొత్తం అతనిపై 44 కేసులు ఉన్నాయని తెలిపారు. గతంలో పలుమార్లు చేసిన దొంగతనాలకు జైలు శిక్ష అనుభవించినా, జైలు నుంచి విడుదలైన తరువాత కూడా తన ప్రవర్తనలో మార్పు లేకుండా మళ్లీ దొంగతనాలకు పాల్పడుతూ ప్రజల్లో భయాందోళనలు సృష్టిస్తున్నాడు. ఇలాంటి పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని, ప్రజల భద్రతను కాపాడడం కోసం ఆదిలాబాద్ జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ సిఫార్సు మేరకు జిల్లా కలెక్టర్ నిందితుడిపై మళ్లీ పిడి యాక్ట్ నమోదు చేయడం జరిగింది. పీడీ యాక్ట్ నమోదైన నిందితున్ని చర్లపల్లి జైలుకు తరలించడం జరిగింది అని తెలిపారు. నిందితుల అక్రమ కార్యకలాపాలను అరికట్టడమే పోలీసులు తెలిపారు. ఈ సందర్భంగా ఉట్నూర్ సీఐ ఎం ప్రసాద్ మాట్లాడుతూ, పునరావృతంగా నేరాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని, చట్టం పట్ల ఎలాంటి ఉపేక్ష ఉండదని హెచ్చరించారు. ప్రజలు కూడా అనుమానాస్పద వ్యక్తులు లేదా కార్యకలాపాల గురించి వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.

## ప్రతిభ కనబర్చిన కేజీబీవీ విద్యార్థులకు

# జిల్లా కలెక్టర్ అభినందన



రాజన్న సిరిసిల్ల,ఏప్రిల్ 15 (తెలంగాణ వాణి ప్రతినిధి) : ఇంటర్మీడియట్ పరీక్షల్లో ప్రతిభ కనబర్చిన జిల్లాలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ) విద్యార్థులను జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ బుధవారం అభినందించారు.ఇంటర్మీడియట్ మొదటి,రెండవ సంవత్సరం ఫలితాలు విడుదల కాగా, జిల్లాలోని ప్రథమ సంవత్సరంలో సిరిసిల్ల కేజీబీవీ బైపీసీలో కీర్తన 436/440, మర్రిపల్లి కేజీబీవీ ఎంపీసీలో బి.మమత 466/470, రుద్రంగి కేజీబీవీ ఎంపీసీలో జి.మమత 466/470 మార్కులు సాధించారు. తంగళ్లపల్లి కేజీబీవీ ఎం పీ హెచ్ డబ్ల్యూలో ఎల్.శృతి కి 490 /500, వేములవాడ కేజీబీవీ ఏఐఎంఎల్ లో అక్షిత 486/500, మర్రిపల్లి కేజీబీవీలో జి.శ్యామల ఎంపీసీలో 984/1000 మార్కులు సాధించిన సందర్భంగా ఆ విద్యార్థులు జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో కలెక్టర్ ను కలువగా,వారిని అభినందించారు.విద్యార్థులు ఉన్నత లక్ష్యాలు నిర్ణయించుకొని పట్టుదలతో కృషి చేస్తే విజయాన్ని సాధించడం సాధ్యమవుతుందని ఆమె సూచించారు.ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి జగన్ మోహన్ రెడ్డి, జీసీడీఓ పద్మజ, స్పెషల్ ఆఫీసర్స్ తదితరులు పాల్గొన్నారు.

# చదువే పేదరికాన్ని పారద్రోలుతుంది

**వనవాసీ కళ్యాణ పరిషత్ ప్రాంత సహ మహిళా ప్రముఖ్ పెద్దాడ ఆశాలత**



చర్ల, ఏప్రిల్ 15 న్యూస్ (తెలంగాణ వాణి ప్రతినిధి) : చదువే పేదరికాన్ని పారద్రోలే మార్గమని, విద్యార్థుల చదువులకు దాతల సహకారం మరువలేనిదని వనవాసీ కళ్యాణ పరిషత్ ప్రాంత సహ మహిళా ప్రముఖ్ పెద్దాడ ఆశాలత అన్నారు.ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం సుక్మా జిల్లా కుంట గ్రామానికి చెందిన ఇందన అప్పారావు జ్ఞాపకార్థం ఆయన కుమారుడు, కోడలు ఇందన రాంబాబు--వరలక్ష్మి దంపతులు వనవాసీ కొమరం భీం విద్యార్థి నిలయంకు 50 కిలోల బియ్యం అందజేశారు.అలాగే నిలయంలోని విద్యార్థులందరికీ భోజనం, పండ్లు, స్వీట్లు వడ్డించి సత్కరించారు.ఈ సందర్భంగా నిలయ ఉపాధ్యక్షులు గోగికార్ రాంలక్ష్మణ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆశాలత విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు.ప్రతి విద్యార్థి చదువులపై దృష్టి సారిస్తేనే కుటుంబాల నుంచి పేదరికం దూరమవుతుందని, ఇందుకు సమాజంలో అనేక ఆదర్శ వ్యక్తుల ఉదాహరణలు ఉన్నాయని ఆమె గుర్తుచేశారు.వారిని ఆదర్శంగా తీసుకుని కష్టపడి చదివి ఉన్నత స్థాయికి చేరుకోవాలని విద్యార్థులను ప్రోత్సహించారు.పేద విద్యార్థుల విద్యకు విరాళాలు అందిస్తూ తోడ్పడుతున్న ప్రతి ఒక్క దాతకు పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు. క్రమశిక్షణకు మారుపేరుగా నిలవాలని, సంస్థ ప్రతిష్ఠను కాపాడేలా విద్యార్థులు ప్రవర్తిస్తే తల్లిదండ్రులతో పాటు నిలయానికి కూడా మంచి పేరు వస్తుందని ఆశాలత అన్నారు.కార్యక్రమంలో నిలయ కమిటీ అధ్యక్షుడు తాటి పాపారావు, కార్యదర్శి జవ్వాది మురళీకృష్ణ, సహ కోశాధికారి వేములపల్లి ప్రవీణ్ బాబు, కమిటీ సభ్యురాలు పోలిన రమాదేవి, వనవాసీ జిల్లా సహ సంఘటనా కార్యదర్శి గొంది శోభన్‌బాబు, నిలయ ప్రముఖ్ గొంది ప్రసన్నకుమారి తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ ఉద్యమకారుల సదస్సును

# విజయవంతం చేయండి



నర్సంపేట: ఏప్రిల్ 15(తెలంగాణ వాణి ప్రతినిధి) ఈనెల 18 వ తేదీన హైదరాబాదులోని తార్నాక లో గల మర్రి కృష్ణారెడ్డి ఫంక్షన్ హాల్ లో జరిగే తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్రస్థాయి సదస్సును విజయవంతం చేయాలని నెక్కొండ మండల కేంద్రంలో తెలంగాణ ఉద్యమకారుల ఫోరం మండల అధ్యక్షులు కొత్త సంపత్ రెడ్డ మండలంలోని తెలంగాణ ఉద్యమకారులకు పిలుపునివ్వడం జరిగింది. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన వాగ్దానాలలో 250 గజాల ఇంటి స్థలం. హెల్త్ కార్డులు. పెన్షన్. సంక్షేమ పథకాలలో ప్రాధాన్యత కల్పించాలని ప్రధాన డిమాండ్లతో నిర్వహించే సదస్సుకు మండలంలోని ప్రతి తెలంగాణ ఉద్యమకారుడు కదలి రావాలని పిలుపునివ్వడం జరిగింది . ఈ కార్యక్రమంలో జిల్లా మహిళా ఉపాధ్యక్షురాలు శాడా. సరితా రెడ్డి. కొత్త సంపత్ రెడ్డి. పరకాల. బిక్షపతి. పరిపాటి. ఇంద్రసేనారెడ్డి. పాల్గొన్నారు.

## హాస్టల్ విద్యార్థిని మృతికి మద్దతుగా

# నిలిచిన అఖిలపక్ష నాయకులు

**నాయకులను అక్రమంగా**

**అరెస్ట్ చేసినందుకు నిరసనగా ఎల్లారెడ్డి బంద్**



ఎల్లారెడ్డి (తెలంగాణ వాణి ప్రతినిధి) ఎల్లారెడ్డి మండల కేంద్రంలోని బీసీ వెల్ఫేర్ హాస్టల్లో 8వ తరగతి చదువుతున్న శ్రావణి హఠాత్ మరణంతో ఎల్లారెడ్డి మండలం బంద్ కు పిలుపునిచ్చినట్లు అఖిలపక్ష నాయకులు తెలిపారు. మండల కేంద్రంలోని బీసీ వెల్ఫేర్ వసతి గృహంలో చదువుతున్నటువంటి విద్యార్థిని శ్రావణి ఉన్నట్టుండి మరణించడంపై అఖిలపక్ష నాయకులు బగ్గుమన్నారు దీనికి నిరసనగా మండల కేంద్రంలో బుధవారం బారాస మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్ అన్న నిరసన చేపట్టారు ఇట్టి నిరసన కార్యక్రమాలు భాగంగా పోలీసులు ఆయనను అక్రమంగా అరెస్టు చేసి బిక్కనూర్ పోలీస్ స్టేషన్ కు తరలించగా అఖిలపక్ష నాయకులు ఈ విషయంపై తీవ్రంగా ఖండించారు ఇందులో భాగంగా గురువారం ఎల్లారెడ్డి పట్టణ కేంద్రం బంధు పిలుపునిచ్చారు..వ్యాపార వాణిజ్య వర్గాలు బందుకు పూర్తిగా సహకరించాలని వారు కోరారు

# ప్రిన్సిపల్ సెక్రెటరీ (సిడిఎం) కలిసిన ఎమ్మెల్యే



జగిత్యాల: ఏప్రిల్ 15 (తెలంగాణ వాణి ప్రతినిధి) జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ బుధవారం నాడు మున్సిపల్ అభివృద్ధి సంబంధించి ప్రిన్సిపల్ సెక్రెటరీ సిడియం శ్రీదేవి ని కలిసి ఫండ్స్ లో విధి విదానాల గురించి, అందులో ఉన్న జాప్యాలు, జగిత్యాల మున్సిపల్ లో సిబ్బంది కోరుత తదితర అంశాలపై చర్చించగా సానుకూలంగా స్పందించిన శ్రీదేవి తొందర్లోనే వీటన్నిటికి పరిష్కారం చూపిస్తామన్నారు. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసి జగిత్యాల లో జరుగుతున్న వివిధ రాజకీయ పరిణామాల గురించి కూడా చర్చించి, జగిత్యాలలో వివిధ అభివృద్ధి పనులను కూడా త్వరగా పూర్తి చేయాలని కోరగా వెంటనే స్పందించిన ముఖ్యమంత్రి, అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. తొందర్లోనే జగిత్యాల నియోజకవర్గానికి వస్తానని హామీ ఇచ్చారని తెలిపారు. సానుకూలంగా స్పందించిన ముఖ్యమంత్రి, ప్రిన్సిపాల్ సెక్రెటరీ సిడియం శ్రీదేవి కి ఎమ్మెల్యే కృతజ్ఞతలు తెలిపారు.

## నిబంధనలు పాటిస్తూ సురక్షితంగా

# గమ్యస్థానాలకు చేరుకోవాలి

**-జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**




మంచిర్యాల,ఏప్రిల్ 15 (తెలంగాణ వాణి): వాహనదారులు రహదారి భద్రతా నిబంధనలను పాటిస్తూ సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుకోవాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయం నుండి జిల్లా రవాణా శాఖ ఆధ్వర్యంలో అరైవ్ అలైవ్ లో భాగంగా ఏర్పాటు చేసిన బైక్ ర్యాలీలో డి.సి.పి. ఎ.భాస్కర్, జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి. చంద్రయ్య, గుడిపేట పోలీస్ బెటాలియన్ అడ్మిన్ వెంకటరాములు, జిల్లా రవాణా అధికారి గోపికృష్ణ లతో కలిసి జెండా ఊపి ప్రారంభించి పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ రహదారి భద్రత నిబంధనలను పాటించాలని, ప్రభుత్వం చేపట్టిన 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా అరైవ్ - అలైవ్ కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని, ప్రతి వాహనదారుడు రహదారి భద్రత నిబంధనలను పాటిస్తూ సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుకోవాలని తెలిపారు. వాహనదారులు జాగ్రత్తగా వాహనాలను నడపాలని, రోడ్డు ప్రమాదం అంటే ఒక కుటుంబానికి జరిగే ప్రమాదమని తెలిపారు. జిల్లాలో రహదారులపై లైట్లు, బ్లైండ్ స్పాట్లను గుర్తించి తగు ఏర్పాట్ల చేయడం జరుగుతుందని, సిగ్నల్ వ్యవస్థలను ఏర్పాటు చేసి వాహనాలను నియంత్రించడం జరుగుతుందని తెలిపారు. అనుభవానికి, ప్రమాదానికి సంబంధం లేదని, వాహనం నడిపి సమయంలో ఏకాగ్రతతో నడపాలని తెలిపారు. ద్విచక్ర వాహనదారులు, వెనుక కూర్చునే వారు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, కార్ లో ప్రయాణించే ప్రతి ఒక్కరూ సీట్ బెల్ట్ ధరించాలని తెలిపారు. ప్రతి వాహనానికి సంబంధించి ధ్రువపత్రాలు కలిగి ఉండాలని, వాహనదారులు మద్యం సేవించి, మొబైల్ వినియోగిస్తూ వాహనాలు నడపకూడదని, రాంగ్ రూట్ లో వాహనం నడపకూడదని తెలిపారు. తనిఖీలలో మద్యం సేవించి వాహనం నడుపుతూ దొరికినట్లైతే సంబంధిత వాహనదారుడి లైసెన్స్ సస్పెండ్ చేయడం జరుగుతుందని, 18 సంవత్సరాల వయసు నిండని వారు వాహనాలు నడపకూడదని, ఒకవేళ నడిపినట్లయితే వారి తల్లితండ్రులపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. రహదారులపై పరిమిత వేగాన్ని పాటించాలని, రవాణా వాహనాలు పరిమిత లోడ్ రవాణా చేయాలని తెలిపారు. పోలీస్, రవాణా శాఖల సమన్వయంతో ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకున్నప్పటికీ ప్రజలు స్వచ్ఛందంగా భాగస్వామ్యులై వాహనాలను నిబంధనలకు లోబడి జాగ్రత్తగా నడపాలని తెలిపారు. అతివేగం చాలా ప్రమాదమని, వేగం పరిమితిలో ఉండి నిబంధనలు పాటించినట్లయితే గమ్యస్థానానికి సురక్షితంగా చేరుకోవచ్చని తెలిపారు. రోడ్డు భద్రత నిబంధనలను కఠినంగా అమలు చేయడం జరుగుతుందని, ఇందులో భాగంగా బ్రీత్ ఎనలైజర్స్, స్పీడ్ గన్స్ అవసరం మేరకు సమకూర్చేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. వాహనం నడిపే సమయంలో మనం పాటించే చిన్న చిన్న విషయాలే మన ప్రాణాలను కాపాడతాయని తెలిపారు.ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఎల్లారెడ్డిలో ఉద్రిక్తత



ఎల్లారెడ్డి (తెలంగాణ వాణి ప్రతినిధి) బీసీ వెల్ఫేర్ హాస్టల్ లో మృతి చెందిన శ్రావణి మృతి పై అనుమానాలు వ్యక్తం చేస్తూ... బీసీ హాస్టల్లో మృతి చెందిన బాలిక కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ బాలిక కుటుంబ సభ్యులతో కలిసి బాన్సువాడ కామారెడ్డి వెళ్లే రహదారిపై ధర్నాకు దిగిన మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్. ప్రధాన రహదారిపై భారీగా నిలిచిపోయిన వాహనాలు. హాస్టల్లో మృతి చెందిన బాలిక మృతి పట్ల అనుమానాలు ఉన్నాయని సమగ్ర విచారణ జరిపించాలని మాజీ ఎమ్మెల్యే సురేందర్ బాలిక కుటుంబ సభ్యుల డిమాండ్. ధర్నాకు దిగిన సురేందర్ తో పాటు బీఆర్ఎస్ శ్రేణులను అరెస్టు చేసిన పోలీసులు. బాలికపై లైంగిక దాడి జరిగిందని ఆరోపిస్తున్న కుటుంబ సభ్యులు

## ట్రాఫిక్ నియమాలపై

# ప్రతి విద్యార్థికి అవగాహన అవసరం

**అరైవ్...అలైవ్ కార్యక్రమంలో భాగంగా**

**విద్యార్థులకు విస్తృత రోడ్డు భద్రత అవగాహన**



జగిత్యాల (తెలంగాణ వాణి ప్రతినిధి) చిన్న వయస్సులోనే ట్రాఫిక్ నిబంధనలు పాటించడం అలవరచుకోవడం ద్వారా బాధ్యతాయుత పౌరులుగా ఎదగవచ్చనే లక్ష్యంతో అరైవ్, అలైవ్ కార్యక్రమం కింద జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ఆదేశాల మేరకు మూడవ రోజు జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ పరిధుల్లో పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులకు రోడ్డు భద్రతపై విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థుల ద్వారా తల్లిదండ్రుల్లో హెల్మెట్ వినియోగంపై అవగాహన పెంపొందించేందుకు డియర్ పేరెంట్స్, ప్లీజ్ బై ఏ హెల్మెట్ ఫర్ మీ అండ్ మామ్ అనే సందేశంతో ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టారు. విద్యార్థులు తమ తల్లిదండ్రులకు ద్విచక్ర వాహనాలు నడిపేటప్పుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాల్సిన అవసరాన్ని వివరించారు. ప్రతి విద్యార్థి తమ తల్లిదండ్రులకు హెల్మెట్ కొనివ్వమని లేఖలు రాయడం ద్వారా కుటుంబ స్థాయిలో రోడ్డు భద్రతపై అవగాహన పెంపొందించవచ్చని సూచించారు. అలాగే విద్యార్థులకు రోడ్డు దాటేటప్పుడు జీబ్రా క్రాసింగ్ వినియోగం, ట్రాఫిక్ సిగ్నల్స్ పాటించడం, స్కూల్‌కు వెళ్లే సమయంలో ఇరుపక్కల చూసుకుని జాగ్రత్తగా దాటడం, స్కూల్ బస్సులో ఎక్కడం, దిగడం సమయంలో పాటించాల్సిన భద్రతా నియమాలు వంటి అంశాలపై సమగ్ర అవగాహన కల్పించారు.ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు రోడ్డు భద్రతా నియమాలను పాటిస్తూ పిల్లలకు ఆదర్శంగా నిలవాలని, హెల్మెట్, సీట్‌బెల్ట్ వినియోగం వంటి అలవాట్లు నిత్యజీవితంలో పాటించాలని సూచించారు. విద్యార్థులు ఈ కార్యక్రమంలో నేర్చుకున్న విషయాలను కుటుంబ సభ్యులకు, బంధువులకు తెలియజేయాలని పిలుపునిచ్చారు. రోడ్డు భద్రత, ట్రాఫిక్ నియమాలపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు కూడా నిర్వహించగా, ఉత్తమ ప్రతిభ కనబరిచిన మొదటి ముగ్గురు విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

# నియోజకవర్గంలోని ప్రతి ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తాం

## రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగార, గనులు భూగర్భ శాఖ మంత్రి గడ్డం వివేకానంద



మంచిర్యాల (తెలంగాణ వాణి) జిల్లాలోని చెన్నూర్ నియోజకవర్గ పరిధిలోని ప్రతి ప్రాంతాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు చర్యలు తీసుకుంటున్నామని రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగార, గనులు భూగర్భ శాఖ మంత్రి గడ్డం వివేకానంద అన్నారు. బుధవారం జిల్లాలోని మందమర్రి మున్సిపల్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి. చంద్రయ్య, మందమర్రి, క్యాతనపల్లి, చెన్నూర్ మున్సిపాలిటీల కమిషనర్లు రాజలింగు, మారుతి ప్రసాద్, మురళీకృష్ణ, సింగరేణి సంస్థ మందమర్రి ఏరియా జనరల్ మేనేజర్ రాధాకృష్ణ లతో కలిసి మందమర్రి మున్సిపల్ పరిధిలో అభివృద్ధి పనుల నిర్వహణపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి మాట్లాడుతూ ప్రజల సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధి దిశగా ప్రభుత్వం అనేక పథకాలను అమలు చేస్తుందని తెలిపారు. మున్సిపల్ పరిధిలోని అంతర్గత రహదారులు, మురుగు కాలువల వ్యవస్థను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసి మున్సిపాలిటీని పరిశుభ్రంగా ఉంచాలని తెలిపారు. వేసవి అయినందున ప్రజలకు అంతరాయం లేకుండా ప్రతి రోజు నీటిని సరఫరా చేసే విధంగా కార్యచరణ రూపొందించి అమలు చేయాలని తెలిపారు. ప్రభుత్వం చేపట్టిన ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా మున్సిపల్ అభివృద్ధితో పాటు ప్రజా సమస్యల పరిష్కారం దిశగా ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు. మందమర్రి మండల కేంద్రంలోని నైపుణ్య అభివృద్ధి కేంద్రాన్ని జిల్లా ఉపాధి కల్పన అధికారి రవికృష్ణ, ప్రభుత్వ ఐ.టి.ఐ. ప్రిన్సిపల్ దేవానంద్ లతో కలిసి సందర్శించారు. రాష్ట్రంలోని నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించి అభివృద్ధి చెందే దిశగా ప్రోత్సహించడం జరుగుతుందని తెలిపారు. టాంకామ్ ద్వారా విదేశాలలో ఉద్యోగావకాశాలు కల్పించడం జరుగుతుందని, జర్మనీలో ప్రతి సంవత్సరం 5 లక్షల ఉద్యోగుల అవసరం ఉందని, ప్రతి సంవత్సరం 90 వేల వీసాలు జారీ చేసేందుకు ఆ దేశం ముందుకు వచ్చిందని తెలిపారు. రాష్ట్రంలో ప్రభుత్వం చేపట్టిన అధునాతన సాంకేతిక కేంద్రాల (ఎ.టి.సి.)ద్వారా 25 వేల మంది యువతకు వివిధ కోర్సులలో నైపుణ్య అభివృద్ధి శిక్షణ ఇవ్వడం జరుగుతుందని, ఇందుకోసం రాష్ట్ర ప్రభుత్వం 4 వేల కోట్ల రూపాయలు ఖర్చు పెడుతుందని తెలిపారు. టామ్ కామ్ ద్వారా 4 నెలల్లో జర్మన్ భాష నేర్పించి ఉపాధి అవకాశాలు కల్పించడం జరుగుతుందని తెలిపారు. విదేశాలలో ఉపాధి కొరకు ప్రైవేటు ఏజెన్సీల మాటలు నమ్మి మోసపోవద్దని, విదేశాల్లో భారతీయ యువతకు విస్తృతమైన అవకాశాలున్నాయని, టాంకాం ద్వారా అర్హులైన నిరుద్యోగ యువతకు విదేశాలలో ఉపాధి కల్పించడం జరుగుతుందని తెలిపారు. ప్రభుత్వం రాష్ట్రంలోని నిరుద్యోగ యువతకు ఇప్పటికే లక్షకు పైగా ఉద్యోగాలు కల్పించిందని, టామ్ కామ్ కల్పిస్తున్న అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఇదే తరహాలో అసంఘటిత రంగ కార్మికుల సంక్షేమంపై ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన




జగిత్యాల: ఏప్రిల్ 15 (తెలంగాణ వాణి ప్రతినిధి) అగ్నిమాపక వారోత్సవాలలో బాగంగా బుధవారం తెలంగాణ ఫైర్ డిజాస్టర్ రెస్పాన్స్ ఎమర్జెన్సీ అండ్ సివిల్ డిఫెన్స్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో జగిత్యాల పట్టణ ప్రజలలో అగ్ని ప్రమాదాలపై అవగాహన కల్పించేందుకు బస్ స్టాండ్ ప్రాంతాలు ఇతర ప్రజా రద్దీ ప్రాంతాలలో ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. జగిత్యాల పట్టణంలోని టవర్ సర్కిల్, ఓల్డ్ బస్ స్టాండ్ ప్రాంతాలలో అగ్ని ప్రమాదాలపై మాక్ డ్రిల్స్ నిర్వహించారు. ఫైర్ సేఫ్టీ పాంప్లెట్లు, బ్రోచర్లు పంపిణి చేశారు. ఈ సందర్భంగా అగ్నిమాపక శాఖ అధికారులు ప్రజలకు అగ్ని ప్రమాదాల సమయంలో పాటించాల్సిన భద్రతా సూచనలు, ఫైర్ ఎక్విప్మెంట్ వినియోగం, ఎమర్జెన్సీ నంబర్ల ప్రాముఖ్యత గురించి తెలిపారు. ప్రజలు అప్రమత్తంగా ఉండి చిన్న జాగ్రత్తలు తీసుకుంటే పెద్ద ప్రమాదాలను నివారించవచ్చని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో అగ్నిమాపక శాఖ సిబ్బంది అధికారులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు. ఓల్డ్ బస్ స్టాండ్ వద్ద సుమారు 400 మంది ప్రజలు, టవర్ సర్కిల్ వద్ద సుమారు 200 మంది ప్రజలు ఈ కార్యక్రమాన్ని వీక్షించినట్లు అధికారులు తెలిపారు. ఈ మాక్ డ్రిల్స్‌లో సంబంధిత బస్ స్టాండ్‌ల డిపో మేనేజర్ తో పాటు జిల్లా అగ్నిమాపక అధికారి వై. సైదులు, జగిత్యాల స్టేషన్ ఫైర్ ఆఫీసర్ ఏ. కృష్ణకాంత్,సిబ్బంది ఎల్ఎల్ఎఫ్ కె. రవీందర్, జి. మధు, ఎఫ్ఎఫ్టిలు ఎ.మల్లేశం, బి. ప్రణయ్ కుమార్, బి. వెంకటేశ్వర్లు, ఎఫ్ఎఫ్ లు ఎం. కార్తీక్, ఎం. రాజేందర్, హెచ్ జి జి. శ్రీనివాస్ పాల్గొన్నారు.

## సాగునీటి విడుదలను రైతులు సద్వినియోగం చేసుకోవాలి

### 8వ విడతగా ఏప్రిల్ 15 నుండి 5 రోజుల పాటు నీటి సరఫరా



పెద్దపల్లి (తెలంగాణ వాణి ప్రతినిధి) తెలంగాణ ప్రభుత్వ నీటి పారుదల, ఆయకట్టు అభివృద్ధి శాఖ ఆదేశాల మేరకు, పెద్దపల్లి జిల్లా పరిధిలోని శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ కాకతీయ కాలువ ద్వారా డి-83, డి-86 కాలువలకు సాగునీటిని విడుదల చేసినట్లు జిల్లా నీటిపారుదల శాఖ అధికారి శ్రీనివాస్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. యాసంగి సీజన్‌కు సంబంధించి ఇది చివరి విడత 8వ విడత నీటి విడుదల ఏప్రిల్ 15 నుండి వరుసగా 5 రోజుల పాటు సాగునీరు అందిస్తామని, వివిధ మండలాల రైతుల విజ్ఞప్తిని పరిగణనలోకి తీసుకుని, ముఖ్యంగా మొక్కజొన్న , ఆలస్యంగా వేసిన వరి పంటలను కాపాడేందుకు ఈ తడిని విడుదల చేయడం జరుగుతుందని, మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు,చీఫ్ విప్ పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయరమణరావు, రామగుండం శాసనసభ్యులు మక్కన్ సింగ్ రాజ్ ఠాకూర్, జిల్లా కలెక్టర్ శ్రీ కోయ శ్రీ హర్ష రైతుల అవసరాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, నీటి విడుదల కోసం ప్రత్యేక కృషి చేశారని తెలిపారు. సాగునీరు కాలువల చివరి ఆయకట్టు వరకు చేరేలా ఇరిగేషన్ శాఖ సిబ్బంది నిరంతరం విధుల్లో ఉంటారని, నీటి పంపిణీలో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పర్యవేక్షక ఇంజనీర్ ఇరిగేషన్ సర్కిల్, పెద్దపల్లి జిల్లా ఇరిగేషన్ అధికారి సమన్వయం చేసుకుంటూ,కాలువల ద్వారా విడుదల చేసిన నీటిని రైతులు పొదుపుగా, క్రమ పద్ధతిలో తమ పొలాలకు ఉపయోగించుకోవాలని, నీటి విడుదల సమయంలో క్షేత్రస్థాయి సిబ్బందికి రైతులు పూర్తిస్థాయిలో సహకరించి, పంటలను సమృద్ధిగా పండించుకోవాలని జిల్లా నీటిపారుదల శాఖ అధికారి శ్రీనివాస్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

## మండల సభలకు పకడ్బందీ ఏర్పాట్లు.

### జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్.

ములుగు (తెలంగాణ వాణి) ప్రజా పాలన--ప్రగతి ప్రణాళిక 99రోజుల కార్యాచరణలో భాగంగా ఈ నెల 16న మండల కేంద్రాలు,మున్సిపాల్టీలో నిర్వహించనున్న సభలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్ అధికారులను ఆదేశించారు. బుదవారం జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్ టెలీ కాన్ఫరెన్స్ ద్వారా అధికారులకు పలు సూచనలు చేశారు. ముందస్తుగానే సభా వేదికలను సందర్శించి క్షేత్రస్థాయిలో ఏర్పాట్లను పరిశీలించాలని మండల ప్రత్యేక అధికారులను ఆదేశించారు. ఎంపీడీఓలు, తహసీల్దార్లతో, మండల స్థాయి అన్ని శాఖల అధికారులతో సమావేశమై తగు సూచనలు చేయాలన్నారు. సభలు నిర్వహించే ప్రదేశాలలో తగిన నీడ,తాగునీరు వంటి కనీస వసతులు అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్లు మంజూరు,నూతన రేషన్ కార్డుల పంపిణీ,సన్న బియ్యం పంపిణీ, గృహలక్ష్మి, మహాలక్ష్మి, ఇందిరా మహిళా శక్తి పథకం, కళ్యాణ లక్ష్మి, షాది ముబారక్,సన్న వడ్ల బోనస్,ఇతర సంక్షేమ పథకాల గురించి సభలలో అవగాహన కల్పించడంతో పాటు,ఆయా పథకాల ద్వారా ప్రయోజనం పొందుతున్న లబ్దిదారుల వివరాలు చదివి వినిపించాలని, లబ్ధిదారులతో వారి అనుభవాలను ప్రజలకు తెలియజేసేలా చూడాలన్నారు. రేషన్ కార్డులు, పెన్షన్లు, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు వంటి వాటికి సంబంధించి గ్రామ సభలలో వచ్చిన అర్జీలను మండల సభలకు ముందు తప్పనిసరిగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ సభలకు ప్రజాప్రతినిధులను తప్పనిసరిగా ఆహ్వానించాలని,అందరూ భాగస్వాములు అయ్యేలా చొరవ చూపాలన్నారు. సభ ప్రారంభ సమయంలో ప్రోటోకాల్ ప్రకారం ముందుగా రాష్ట్ర గేయం,ముఖ్యమంత్రి సందేశం అందరికీ వినిపించాలన్నారు. రోడ్డు ప్రమాదాలపై అవగాహన పెంపొందించేందుకు ఉద్దేశించిన అరైవ్-అలైవ్ కార్యక్రమం గురించి సభల్లో తెలియజేయాలని అన్నారు. ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా సభల విజయవంతానికి అంకిత భావంతో కృషి చేయాలన్నారు.

## విక్టరీ ఫౌండేషన్ చైర్మన్ ఆధ్వర్యంలో బాలుకు లైఫ్ టైం అచీవ్మెంట్ అవార్డు




రాజాపేట: ఏప్రిల్ 15(తెలంగాణ వాని విలేఖరి) అంబేద్కర్ జయంతి సందర్భంగా హైదరాబాద్ మియాపూర్ లో విక్టరీ ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ విజయ్ కుమారి ఆధ్వర్యంలో 135వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండలంలోని రేణికుంట గ్రామానికి చెందిన సామాజిక సేవకులు నీరటి (కరాటే) బాలు చేస్తున్న సేవలను గుర్తించి విక్టరీ ఫౌండేషన్ తరపున లైఫ్ టైం అచీవ్మెంట్ అవార్డును అందజేశారు. ఈ సందర్భంగా శాలువా పుష్పగుచ్చం, జ్ఞాపిక తొ సత్కరించారు. ఈ సందర్భంగా బాలు మాట్లాడుతూ భవిష్యత్తులో ఇంకా మరిన్ని సామాజిక సేవలు చేయడానికి ఈ అవార్డు తన బాధ్యతను ఇంకా పెంచిందని తెలిపారు. అవార్డు కృషి చేసిన వారందరికీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

## రేవంత్ పోవాలి... కేసీఆర్ రావాలి

### బి ఆర్ ఎస్ జిల్లా అధ్యక్షుడు కల్వకుంట్ల విద్యాసాగర్ రావు



జగిత్యాల: ఏప్రిల్ 15 (తెలంగాణ వాణి ప్రతినిధి) తెలంగాణ ప్రజల్లో రేవంత్ పోవాలి కేసీఆర్ రావాలని చర్చ జరుగుతుందని జగిత్యాల జిల్లా టిఆర్ఎస్ అధ్యక్షుడు కల్వకుంట్ల విద్యాసాగర్ రావు అన్నారు. జిల్లా బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఈనెల 20వ తేదీన కేసీఆర్ బహిరంగ సభ గురించి సన్నాహక సమావేశంలో పాల్గొన్న జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు కల్వకుంట్ల విద్యాసాగర్ రావు, ఎమ్మెల్సీ ఎల్ రమణ, కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్, జిల్లా మాజీ జడ్పీ చైర్పర్సన్ దావ వసంత సురేశ్, మాజీ మార్కెట్ చైర్మన్ లోక బాపు రెడ్డి ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మాజీ మంత్రి జీవన్ రెడ్డి ఈనెల 20వ తేదీన కేసీఆర్ సమక్షంలో చేరుతున్న సందర్భంగా కెసిఆర్ భారీ బహిరంగ సభకు నాయకులు, అభిమానులు కార్యకర్తలు ప్రతి గ్రామం నుండి, పట్టణం నుండి పెద్ద ఎత్తున తరలివచ్చి సభను విజయవంతం చేయాలని అన్నారు. మళ్లీ బిఆర్ఎస్ పార్టీ జైత్రయాత్ర జగిత్యాల నుండి ప్రారంభమవుతుందని అన్నారు. తెలంగాణలోని ప్రజలందరూ రేవంత్ పోవాలి కేసీఆర్ రావాలని చర్చించుకుంటున్నట్లు వెల్లడించారు. నాయకులు, కార్యకర్తలు అందరూ సమన్వయంతో కలిసికట్టుగా పని చేసి వచ్చే ఎన్నికలలో కేసీఆర్ ని మళ్లీ తిరిగి ముఖ్యమంత్రి చేసుకునే వరకు అందరం కష్టపడి పని చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ మండల అధ్యక్షులు కౌన్సిలర్లు సర్పంచ్లు సీనియర్ నాయకులు ప్రజాప్రతినిధులు మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## వేములవాడ పోలీస్ స్టేషన్ పరిధిలోని ములవాగు ఇసుక రీచ్ ఆకస్మిక తనిఖీ

### అక్రమ ఇసుక రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవు
### వేములవాడ డిఎస్పీ శ్రీనివాసులు





వేములవాడ (తెలంగాణ వాణి ప్రతినిధి) వేములవాడ పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలోని ములవాగు ఇసుక రీచ్‌ను పట్టణ ఇన్స్పెక్టర్ వీరప్రసాద్ తో కలిసి డీఎస్పీ శ్రీనివాసులు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఇసుక తవ్వకాల విధానం,రవాణా అనుమతులు,రికార్డుల నిర్వహణ తదితర అంశాలను సమగ్రంగా పరిశీలించారు. రాష్ట్ర ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం 'మన ఇసుక వాహనం' ఆన్లైన్ విధానం ద్వారానే ఇసుక సరఫరా చేయాలని అధికారులకు సూచించారు. అక్రమంగా ఇసుక రవాణా చేయడం,అనధికార నిల్వలు ఉంచడం వంటి చర్యలకు పాల్పడితే సంబంధిత వ్యక్తులపై కేసులు నమోదు చేసి, వాహనాలను సీజ్ చేస్తామని డీఎస్పీ హెచ్చరించారు. ఇసుక రవాణాలో పారదర్శకత పాటిస్తూ ప్రభుత్వ నిబంధనలు తప్పనిసరిగా అనుసరించాలని ఆయన స్పష్టం చేశారు.

## అగ్నిమాపక వారోత్సవాల పోస్టర్ల ఆవిష్కరణ...



రాజన్న సిరిసిల్ల,ఏప్రిల్ 15 (తెలంగాణ వాణి జిల్లా ప్రతినిధి) : ఈనెల 14వ తేదీ నుంచి అగ్నిమాపక వారోత్సవాలు నిర్వహించనున్నట్లు జిల్లా ఎస్పీ మహేష్ బి.గితే తెలిపారు. అగ్నిమాపక వారోత్సవాల పోస్టర్లను జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లా ఎస్పీ, అగ్నిమాపక శాఖ అధికారులతో కలిసి ఆవిష్కరించారు. అగ్నిమాపక దళ సిబ్బంది స్మారకార్థం ప్రతి సంవత్సరం ఏప్రిల్ 14 వ తేదీ నుంచి 20వ తేదీ వరకు దేశవ్యాప్తంగా అగ్నిమాపక దళ వారోత్సవాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అగ్ని ప్రమాదాలు జరగకుండా ప్రజలు తీసుకోవలసిన జాగ్రత్తలపై ప్రచారం చేస్తూ ప్రజలను చైతన్యవంతులను చేయడం ఈ వారోత్సవాల ముఖ్య ఉద్దేశమన్నారు. ఈ వారం రోజుల పాటు జిల్లాలోని అన్ని స్కూల్స్, హాస్పిటల్స్, అపార్ట్మెంట్స్, గ్యాస్ గోడౌన్స్, పెట్రోల్ బంక్స్, సినిమా హాళ్లు,పరిశ్రమలకు వెళ్లి అగ్ని ప్రమాదాల నివారణపై ప్రజలకు అవగాహన కల్పిస్తామని జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. ప్రజల ప్రాణ,ఆస్తి రక్షణ,అగ్ని ప్రమాదాలు తగ్గించడం ప్రధాన ఉద్దేశ్యమని స్పష్టం చేశారు. అగ్నిమాపక పరికరాల వినియోగం, మంటలు ఆర్పడం, భవనాల నుంచి ఎలా బయటికి రావడం, పొగ నిండిన గదుల్లో నుంచి బయట పడడంపై తదితర అంశాలపై అవగాహన కల్పిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ చంద్రయ్య, ఆర్.ఐ లు యాదగిరి, రమేష్, సురేష్, స్టేషన్ ఫైర్ ఆఫీసర్ నరేందర్, సిబ్బంది పాల్గొన్నారు.

## అభివృద్ధి చేసే పనులపై సమీక్ష సమావేశం నిర్వహించిన సిఎంసి కమిషనర్



హైదరాబాద్/ శేరిలింగంపల్లి (తెలంగాణ వాణి విలేకరి) శేరిలింగంపల్లి జోన్ పరిధిలో జరుగుతున్న వివిధ అభివృద్ధి పనులు, ప్రజా సమస్యల పరిష్కారంపై సిఎంసి కమిషనర్ శ్రీమతి జి సృజన ఐఏఎస్ బుధవారం జోనల్ కార్యాలయంలో ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జోనల్ కమిషనర్ హేమంత్ బోర్ఖడే ఐఏఎస్., ఇంజనీరింగ్, టౌన్ ప్లానింగ్, రెవెన్యూ, యూబీడీ యుబి టి, యూసీడీ యూసీడి విభాగాల అధికారులు పాల్గొన్నారు. సమావేశంలోని ముఖ్య అంశాలు గడువులోగా పనులు పూర్తి: ప్రస్తుతం కొనసాగుతున్న పనులన్నింటినీ ' 99 రోజుల ప్రోగ్రాం'లో భాగంగా జూన్ 2, 2026 లోపు పూర్తి చేయాలని కమిషనర్ ఆదేశించారు. కనీసం 190 పనులను ఈ గడువులోగా పూర్తి చేయాలని లక్ష్యంగా నిర్ణయించారు. రోడ్ల నిర్వహణ: జోన్‌లోని అన్ని రోడ్లకు ఎండ్-టు-ఎండ్ కార్పెటింగ్ చేయాలని, ఎక్కడా గుంతలు లేకుండా జూన్ 2 లోపు మరమ్మతులు పూర్తి చేయాలని స్పష్టం చేశారు. అలాగే రోడ్లపై ఉన్న ఆక్రమణలను తక్షణమే తొలగించాలని ఆదేశించారు. మురుగునీటి కాలువల పూడికతీత: వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని ఏప్రిల్ చివరి నాటికి జోన్ అంతటా పూడికతీత పనులు డిసైలటింగ్ పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రజా సమస్యల పరిష్కారం: వీధి దీపాల సమస్యలపై అసిస్టెంట్ ఇంజనీర్లు తక్షణమే స్పందించాలని, ప్రజలఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని సూచించారు. ఆస్తుల వివరాలు: క్రీడా ప్రాంగణాలు, పార్కులు, కమ్యూనిటీ హాళ్లు వంటి ప్రభుత్వ ఆస్తుల పూర్తి సమాచారాన్ని సేకరించాలని, ఖాళీ స్థలాలకు 10 రోజుల్లోపు హద్దులు. బౌండరీ ఫిక్సషన్. ఏర్పాటు చేయాలని ఆదేశించారు. పరిశుభ్రత. దోమల నివారణ: చెరువుల్లో గుర్రపుడెక్క తొలగింపు మే చివరి నాటికి పూర్తి కావాలని, దోమల నివారణకు ప్రతి 10 రోజులకు ఒకసారి ప్రతి ప్రాంతంలో ఫాగింగ్. స్ప్రేయింగ్ జరిగేలా షెడ్యూల్ రూపొందించాలని కమిషనర్ తెలిపారు. జంక్షన్ల అభివృద్ధి: జంక్షన్ల సుందరీకరణకు ప్రాధాన్యత ఇవ్వాలని, ఇందుకోసం కార్పొరేట్ సంస్థల సామాజిక బాధ్యత సి ఎస్సార్ నిధులను వినియోగించుకోవాలని సూచించారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహించకుండా, విభాగాల మధ్య సమన్వయంతో పనిచేస్తూ లక్ష్యాలను సకాలంలో చేరుకోవాలని కమిషనర్ అధికారులను ఆదేశించారు. పురోగతిని పర్యవేక్షించేందుకు ప్రతి వారం సమీక్షా సమావేశాలు నిర్వహిస్తామని తెలియజేశారు.

## మక్కల కొనుగోలు కేంద్రం ని సందర్శించిన జువ్వాడి కృష్ణారావు.



ఇబ్రహీంపట్నం ఏప్రిల్ 15 (తెలంగాణ వాణి విలేకరి) జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలోని మక్కల కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి,రైతులతో మాట్లాడిన జువ్వాడి కృష్ణారావు కొనుగోలు ప్రక్రియ త్వరగా పూర్తి చెయ్యాలని, రైతులకు ఇబ్బంది కలుగకుండా కొనుగోలు ప్రక్రియ వేగవంతం చేసి,జొకిన మక్కలసంచులు త్వరగ లోడింగ్ త్వరగా పూర్తి చెయ్యాలని సంబంధిత అధికారులతో మాట్లాడారు.ఈ కార్యక్రమం లోకాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గూడ శ్రీకాంత్ మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడు ఎలాల వెంకట్ రెడ్డి,బిసి సెల్ అధ్యక్షుడు బుస రాజేష్,ఎలిసే రాజు, గుడ ఐలాపూర్ భూమారెడ్డి,గూడ రాజారెడ్డి,పిట్టల వంశీ,కళ్లెం సత్య రెడ్డి,రెబ్బాటి శేఖర్, తిమ్మని రాములు,వాల్గొట్ నరేష్ బజ్జి సంజీవ్,కనుక జగన్, తదితరులు పాల్గొన్నారు.

## చెత్తను వేరు చేయడం ప్రతి ఒక్కరి బాధ్యత

**చెత్త విభజన ప్లాస్టిక్ నిషేధ అవగాహన సదస్సులో**

**- మున్సిపల్ చైర్ పర్సన్ దండి లక్ష్మి**



హుస్నాబాద్: ఏప్రిల్ 15 తెలంగాణ వాణి ప్రతినిది ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా హుస్నాబాద్ పట్టణంలోని 17వ వార్డులో పురపాలక సంఘం ఆధ్వర్యంలో మంగళవారం చెత్త విభజన, హోమ్ కంపోస్టింగ్, ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ కార్యక్రమానికి పురపాలక సంఘ చైర్‌పర్సన్ దండి లక్ష్మీ అధ్యక్షత వహించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇంటి నుంచి వెలువడే చెత్తను నాలుగు రకాలుగా వేరు చేసి మున్సిపల్ వాహనాలకు అందించాలని సూచించారు. డ్రైనేజీల్లో చెత్త వేయరాదని, చెత్తను వేరు చేయడం ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు.ఇంటి పరిసరాల్లో నిల్వ నీరు ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, సెప్టిక్ ట్యాంకులను మూడు సంవత్సరాలకు ఒకసారి శుభ్రం చేయించుకోవాలని సూచించారు. అవసరం లేని కానీ ఉపయోగపడే వస్తువులను ఆర్‌ఆర్‌ఆర్ కేంద్రాలకు అందించాలని కోరారు.వైస్ చైర్‌పర్సన్ చిత్తారి పద్మ మాట్లాడుతూ ప్లాస్టిక్ ప్లేట్ల వినియోగాన్ని పూర్తిగా నివారించాలని, అవి ఆరోగ్యానికి హానికరమని చెప్పారు. వాటి బదులుగా మెప్మా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టీల్ బ్యాంకులను వినియోగించాలని సూచించారు.వార్డు కౌన్సిలర్ గాదెపాక రవీందర్ మాట్లాడుతూ చెత్తను వేరు చేయకపోవడం వల్ల కలిగే నష్టాలను వివరించారు.తడి చెత్తతో తయారు చేసే ఎరువును మొక్కలకు వినియోగించాలని, ప్రతి మహిళ కనీసం మరో పదిమందికి చెత్త విభజనపై అవగాహన కల్పించాలని కోరారు.ఈ కార్యక్రమంలో సానిటరీ ఇన్‌స్పెక్టర్ బాల ఎల్లం, పర్యావరణ అధికారి రవికుమార్, బసిల్ ఫౌండేషన్ సూపర్వైజర్ నవీన్, వార్డ్ ఇన్‌చార్జ్ అధికారులు సతీష్, శ్రీకాంత్, వార్డ్ ఆర్‌పి రజిత తదితర సిబ్బంది పాల్గొన్నారు.

## కాంగ్రెస్ ప్రైవేట్ లిమిటెడ్ గా మారింది

**- మాజీ మంత్రి జీవన్ రెడ్డి**




జగిత్యాల: ఏప్రిల్ 15 (తెలంగాణ వాణి ప్రతినిధి) సీఎం రెవంత్‌రెడ్డి ప్రైవేట్ లిమిటెడ్ కంపనీగా మారటంతో తాను కాంగ్రెస్ పార్టీ నుంచి బయటకు వెళ్లానని.. పబ్లిక్ లిమిటెడ్ కంపనీగా కొనసాగినన్ని రోజులు పార్టీలో ఉన్నానని.. సీనియర్ నేత, మాజీ మంత్రి టి. జీవన్‌రెడ్డి వ్యాఖ్యానించారు. జగిత్యాలలో బుధవారం నాడు ఆయన మీడియాతో మాట్లాడుతూ అనుబంధాన్ని తెంచుకోవాలని ఎవరు కోరుకోరన్నారు. కార్యకర్తలకు న్యాయం జరగలేకనే మానసిక క్షోభకు గురయ్యానని తెలిపారు.మీనాక్షి నాటరాజన్ 80 శాతం సీట్లు సీనియర్లకు ఇస్తామని... 40 శాతం ఇచ్చారన్నారు. పార్టీ సంబంధం లేని వారికి భీ పాంలు ఇస్తే ఇప్పటికైన సరి చేయి... నిన్న సీఎం కలిసిన వారికి న్యాయం చేయాలని కోరారు. సీఎం రేవంత్ రెడ్డి పై ప్రజా పోరాటం చేసేందుకే బయటకు వచ్చానన్నారు..ఇపుడు కాంగ్రెస్ లో కొనసాగుతున్న వారికైన న్యాయం చేయాలని మాజీ మంత్రి జీవన్ రెడ్డి డిమాండ్ చేశారు.

## ప్రమాదవశాత్తు చెరువులో చెరువు లో పడి వ్యక్తి మృతి



జగిత్యాల/ వెల్గటూర్ (తెలంగాణ వాణి ప్రతినిధి) వెల్గటూర్ మండలం లోని మొక్క ట్రావుపేట గ్రామానికి చెందిన అంకతి పెద్ద కోటయ్య తండ్రి లింగయ్య, 65 సంలు, పెరిక కులం అనునతడు కూలీ పనులు చేసుకొని జీవిస్తున్నాడు, మంగళవారం రోజున ఉదయం 8 గంటలకు పెద్ద కోటయ్య, ఇంటి నుంచి పశువులు మేపడానికి వెళ్లి, అట్టి పశువులు కప్పారావుపేట గ్రామా శివారులో గల చెరువులోకి పోగా, వాటిని తోలడానికి పెద్ద కోటయ్య చెరువులోకి దిగగా, ప్రమాదవశాత్తు నీటిలో మునిగి మరణించినాడని, అతని కొడుకు అంకతి రవి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు లో భాగంగా మృతుడు చనిపోయిన స్థలాన్ని సందర్శించి, మృతుడి శవాన్ని చెరువు నుంచి బయటకు తీయించి అక్కడే శవ పంచనామా నిర్వహించి ఆ తర్వాత మృతుడి శవం కు పోస్ట్ మార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రి, జగిత్యాల కు తరలించిటం జరిగింది.

## కళాకారుడు పొన్నాల అశోక్‌కు అంబేద్కర్ జీవన సాఫల్య పురస్కారం




హుస్నాబాద్ (తెలంగాణ వాణి ప్రతినిది) తెలంగాణ ఉద్యమ కళాకారుడు, ప్రముఖ సామాజిక కార్యకర్త పొన్నాల అశోక్‌ను ప్రతిష్టాత్మక డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ లైఫ్ టైమ్ అచీవ్‌మెంట్ అవార్డు 2026 వరించింది. భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ 135వ జయంతిని పురస్కరించుకుని గుంతకల్లుకు చెందిన విక్టరీ ఫౌండేషన్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో నిన్న హైదరాబాద్‌లో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. తెలంగాణ స్వరాష్ట్ర ఉద్యమంలో కళాకారుడిగా తన వంతు విశిష్ట సేవలు అందించడమే కాకుండా, మంజులక్క యువసేన సభ్యుడిగా నిరంతరం సామాజిక సేవా కార్యక్రమాల్లో పాల్గొంటూ సమాజ మార్పు కోసం కృషి చేస్తున్న అశోక్‌ను ఈ పురస్కారానికి ఎంపిక చేశారు.ఈ సందర్భంగా విక్టరీ ఫౌండేషన్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ విజయకుమార్ చేతుల మీదుగా అశోక్ ఈ అవార్డును అందుకున్నారు.అనంతరం ఆయన మాట్లాడుతూ 2009 నుండి కళా రంగంలో, సామాజిక సేవా పథంలో తాను సాగిస్తున్న ప్రయాణాన్ని గుర్తించి, ఈ గౌరవాన్ని అందించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు.మహనీయుల ఆశయ సాధన కోసం పనిచేస్తున్న తనకు ఈ పురస్కారం మరింత బాధ్యతను పెంచిందని, భవిష్యత్తులోనూ తన వంతు సామాజిక సేవను కొనసాగిస్తానని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రతినిధులు పాల్గొని అశోక్‌ను ఘనంగా సత్కరించారు.

## హెల్మెట్ ధరించి రోడ్డు భద్రత నియమాలు పాటించండి.

**వన్ టౌన్ సీఐ ఇంద్ర సేనా రెడ్డి**




పెద్దపల్లి :ఏప్రిల్, 15 (తెలంగాణ వాణి ప్రతినిధి ) రామగుండం పోలీస్ కమిషనరేట్ పెద్దపల్లి జోన్ గోదావరిఖని వన్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో రోడ్డు భద్రత, ప్రమాదాల నివారణ (అరైవ్ - అలైవ్ కార్యక్రమం లో భాగంగా ఈరోజు విద్యార్థుల ద్వారా తల్లిదండ్రులకు హెల్మెట్ ధరించి ట్రాఫిక్ నిబంధనలపై లేఖలు రాయించే ప్రత్యేక ప్రచార కార్యక్రమం చేపట్టారు ముఖ్యంగా తల్లిదండ్రులు తమ పిల్లల భద్రతను దృష్టిలో ఉంచుకుని ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని విద్యార్థులు వారి నాన్న కి, రోడుపై చాలా ప్రమాదాలు అవుతాయి నాన్న హెల్మెట్ ధరించు మాకు తీసుకొని రా లేఖల ద్వారా విద్యార్థులు విజ్ఞప్తి చేశారు. రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత ట్రాఫిక్ నియమాలు పాటించడం ద్వారా ప్రాణాలను కాపాడుకోవచ్చని సీఐ ఇంద్రసేనారెడ్డి అన్నారు .

## ఉపాధి హామీ పథకం లో సమస్యల వెల్లువ



ఎల్లారెడ్డి ఏప్రిల్ 15 తెలంగాణ వాణి ప్రతినిధి ఎల్లారెడ్డి మండలం మల్కాపూర్ గ్రామం లో ఉపాధి హామీ పని కొరకు ఎన్నిసార్లు గ్రామ సభ పెట్టిన గ్రామం లో పనికి రాలేరు ఫీల్డ్ అసిస్టెంట్ అందుబాటులో లేక చాలా ఇబ్బందులు పడేవారు కానీ మంచి దృఢ సంకల్పం తో గ్రామ సర్పంచ్ భర్త, మరియు ఉపసర్పంచ్ భర్త ముందుకు వచ్చి స్వయంగా వారి పేర్లు ముందుగా నమోదు చేసుకొని మిగతా అందుబాటులో ఉన్నా 15మంది ని కూడా వారి వెంట పని చేయించి అటెండెన్స్ వేయించారు గ్రామ అభివృద్ధి లో సర్పంచ్, ఉప సర్పంచ్ ల భర్తలు ఆదర్శవంతంగా గ్రామాన్ని ముందుకు తీసుకు పోతున్నందుకు గ్రామ ప్రజలు హర్షం వక్తం చేస్తున్నారు. గ్రామ సర్పంచ్ భర్త ఉత్తరప్రదేశ్ లో అగ్రికల్చర్ దీూజ చేసి గ్రామం కు మంచి చేద్దాం అని ఉన్నత చదువులు వదిలి వచ్చారు, ఉపసర్పంచ్ భర్త ఇంటర్ పూర్తి చేసి ఎవరు ముందుకు రాని సమయం లో వచ్చి ప్రస్తుతం సీనియర్ మెట్ గా సేవలు అందిస్తున్నారు

## చిన్న పెండ్యాలలో ఉచిత కంటి చికిత్స శిభిరం




**చికిత్స చేయించుకోవాలని ప్రజలకు చిల్పూర్ ఎస్సై పిలుపు**

చిల్పూర్:ఎప్రిల్ 15 (తెలంగాణ వాణి ప్రతినిధి) చిల్పూర్ మండలం చిన్న పెండ్యాల జిల్లా పరిషత్ హై స్కూల్, లో గురువారం ఉదయం 8:30 గంటలకు డాక్టర్ అగర్వాల్ కంటి ఆసుపత్రి వారు కంటికి ఉచితంగా చికిత్స చేయడానికి వైద్య శిభిరం నిర్వహిస్తున్నరని చిల్పూర్ మండలంలోని అన్ని గ్రామాల్లో కంటి సమస్యలతో బాధపడుతున్నవారు, చూపు పరీక్ష, చికిత్స చేయించు కోవడం కోసం తప్పకుండా ఈ సదవకాశాన్ని వినియోగించుకో వాలని చిల్పూర్ ఎస్సై నవీన్ కుమార్ ఒక ప్రకటనలో ప్రజలకు విజ్ఞప్తి చేశాడు.

## బిఆర్ఎస్ నుండి కాంగ్రెస్ పార్టీలో చేరిక



బోథ్,బజార్హత్నూర్,ఏప్రిల్ 15(తెలంగాణా వాణి ప్రతినిధి) బజార్‌హత్నూర్ గ్రామానికి చెందిన మాజీ ఉప సర్పంచ్, గ్రామ మున్నూరుకాపు సంఘం సలహా సభ్యుడు చాట్ల విలాస్,బాలన్‌పూర్ గ్రామానికి చెందిన ఆదివాసీ నాయకుడు తులసీ రాం బోథ్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గం ఇంచార్జి ఆడే గజేందర్,జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లెపూల నర్సయ్య సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు.ఈ సందర్భంగా చేసిన వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధన కోసం కోట్లాది మంది ప్రజలతో కలిసి తాను కూడా నిరంతరం పోరాటం చేశానని,అయితే తాను పనిచేసిన పార్టీలో కనీస గుర్తింపు లేదా గౌరవం లభించలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు చులకనగా చూసే పరిస్థితులు ఎదురవ్వడంతో,పేద ప్రజల సంక్షేమం కోసం పనిచేస్తున్న ప్రజా ప్రభుత్వం అయిన కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలు తనను ఆకర్షించాయని తెలిపారు. అందుకే ఆ పార్టీకి మద్దతుగా చేరుతున్నట్లు వెల్లడించారు ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంధాలయ చైర్మన్ మల్లెపూల నర్సయ్య, మండల కన్వీనర్ జల్కె పాండురంగ్,మాజీ నెట్ క్యాప్ డైరెక్టర్ చిలుకూరి భూమన్న, నాయకులు.విజేందర్,అరే పాండు,రవి సందీప్,బద్దం పోతారెడ్డి,యండి సద్దాం తదితరులు పాల్గొన్నారు.

## ఆర్ కొత్తగూడెంలో పాలకవర్గం కృషితో వారపు సంత ఏర్పాటు

**సర్పంచ్ తుర్రం రవికుమార్**



చర్ల ఏప్రిల్ (తెలంగాణ వాణి ప్రతినిధి) భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, చర్ల మండలం ఆర్.కొత్తగూడెం గ్రామపంచాయతీ పరిధిలో నూతన వారపు సంత 2026 ఏప్రిల్ 15 (బుధవారం) సర్పంచ్ తుర్రం రవికుమార్ ప్రారంభించారు. ఆత్మ కమిటీ చైర్మన్ ఇందల బుచ్చిబాబు మాట్లాడుతూ, ఎట్టకేలకు గ్రామవాసుల కోరిక ప్రకారం సంత ఏర్పాటు చేసినట్టు, అందరికీ నాణ్యమైన వస్తువులు గిట్టుబాటు ధరలకు అందుబాటులో ఉంటాయని తెలిపారు. ఇందుకు కృషి చేసిన సర్పంచ్ తుర్రం రవికుమార్, ఉపసర్పంచ్ కాపుల కృష్ణార్జునరావు, పాలకమండలి సభ్యులకు అభినందాలు తెలిపారు. పంచాయతీ సెక్రటరీ శోభరాణి మాట్లాడుతూ, ప్రతివారం సంతని మరింత అభివృద్ధి చేసి, పక్క మండలాల వ్యాపారులను కూడ ఆహ్వానిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆత్మ కమిటీ చైర్మన్ ఇందల బుచ్చిబాబు, కంగాల పెద్ద బుజ్జి, చిన్న బుజ్జి, సీనియర్ నాయకులు ఇందల రమేష్, జోగి రాజు, గొట్టిముక్కల సీతారామరాజు, ఉపసర్పంచ్ కాపుల కృష్ణార్జునరావు, ఆకుల ప్రసాద్, ఎగ్గడి సాంబయ్య, నారెడ్ల సాంబశివరావు, ఎడారి శ్రీను, వార్డు మెంబర్లు కారం సుధాకర్, కనితి రజిని, చింతకాయల స్వరూప, పాయం లక్ష్మి, చిన్న గొర్ల రాజు, సోయం శ్రీను, నూప రమేష్, పోలోజు నాగరాజు, నూప కృష్ణ, కనితి నారాయణ, గొరస పవన్ చారి, మధు, పాయం రాముడు, చింతకాయల నాగరాజు, బుర్రం ఎర్రబాబు, కోర్స నాగేంద్ర కుమారి, లక్ష్మీకాంతం, పంచాయతీ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

## మల్లూరు శ్రీ హేమాచల లక్ష్మీ నరసింహ స్వామి బ్రహ్మోత్సవాలకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలి.

**- ఏప్రిల్ 27వ తేదీ నుంచి మే 5వ తేదీ వరకు**

**9 రోజుల పాటు ఉత్సవాల జాతర నిర్వహణ**

**- జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్.**



ములుగు (తెలంగాణ వాణి) ములుగు జిల్లా మంగపేట మండలం మల్లూరు శ్రీహేమాచల లక్ష్మీనరసింహ స్వామి ఆలయ పరిసరాలను ములుగు జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ క్షేత్రస్థాయిలో పరిశీలించి, బ్రహ్మోత్సవాల నిర్వహణపై సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు ఏప్రిల్ 27వ తేదీ సోమవారం నుంచి మే 5వ తేదీ మంగళవారం వరకు తొమ్మిది రోజుల పాటు జరిగే మల్లూరు శ్రీ హేమాచల లక్ష్మీనరసింహ స్వామి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. అధికారులను ఆదేశించారు. అనంతరం జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ శ్రీహేమాచల లక్ష్మీనరసింహ స్వామి ఉత్సవాల జాతర పోస్టర్ ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్. మాట్లాడుతూ మల్లూరు శ్రీ హేమాచల లక్ష్మీ నరసింహస్వామి బ్రహ్మోత్సవాలకు రాష్ట్రవ్యాప్తంగా భక్తులు తరలివచ్చే అవకాశం ఉంది. అన్ని శాఖల అధికారులు, సమన్వయంతో పనిచేసి భక్తులకు స్వామి వారి దర్శనం సులభతరం చేయాలి అన్నారు.

ఎండ తీవ్రత దృష్ట్యా భక్తుల కోసం క్యూ లైన్లలో నిరంతరం మంచినీటి సౌకర్యం కల్పించాలని, ఆలయ పరిసరాల్లో, స్నానపు ఘాట్ల వద్ద పారిశుధ్యం పై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, ఎప్పటికప్పుడు చెత్తను తొలగిస్తూ పరిసరాలను పరిశుభ్రంగా సంబంధిత అధికారులను ఆదేశించారు. ఉత్సవాలు ముగిసే వరకు ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసి, అవసరమైన మందులు, ఓ.ఆర్.ఎస్ ప్యాకెట్లు అంబులెన్స్ అందుబాటులో ఉంచాలని పేర్కొన్నారు. భక్తుల రద్దీకి అనుగుణంగా ఆర్టీసీ ప్రత్యేక బస్సులను నడపాలని, వాహనాల పార్కింగ్ విషయంలో ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా పోలీస్ శాఖ తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. భక్తులకు అందించే ప్రసాదం నాణ్యతగా ఉండాలని, అన్నదాన కార్యక్రమాల వద్ద తోపులాట జరగకుండా క్రమశిక్షణతో కూడిన ఏర్పాట్లు చేయాలని ఆలయ కమిటీకి సూచించారు.

## ధాన్యం కొనుగోలు షురూ!

# మద్దతు ధరతో రైతులకు భరోసా

**క్వింటాకు రూ. 2,389 మద్దతు ధర**

**సన్నాలకు రూ. 500 బోనస్**

**దళారుల బారిన పడకండి**

**మార్కెట్ కమిటీ చైర్మన్ కంది తిరుపతిరెడ్డి**



హుస్నాబాద్ (తెలంగాణ వాణి ప్రతినిధి) రైతుల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం ధాన్యం కొనుగోలు ప్రక్రియను ముమ్మరం చేసిందని హుస్నాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ కంది తిరుపతి రెడ్డి తెలిపారు. బుధవారం హుస్నాబాద్ వ్యవసాయ మార్కెట్ యార్డులో సింగిల్ విండో, మార్కెట్ కమిటీ సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆత్మ కమిటీ చైర్మన్ జంగపల్లి ఐలయ్యతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా తిరుపతి రెడ్డి మాట్లాడుతూ.. రైతులు తాము పండించిన పంటను దళారులకు అమ్మి నష్టపోకూడదనే ఉద్దేశంతో ప్రభుత్వం ఈ కేంద్రాలను ఏర్పాటు చేసిందన్నారు. ప్రభుత్వం నిర్ణయించిన కనీస మద్దతు ధర ప్రకారం 'ఏ' గ్రేడ్ రకానికి క్వింటాకు రూ. 2,389, సాధారణ రకానికి రూ. 2,369 చెల్లిస్తామని వివరించారు. ముఖ్యంగా సన్న వడ్లు పండించిన రైతులకు క్వింటాకు రూ. 500 అదనపు బోనస్ అందించడం వల్ల అన్నదాతలకు భారీ లబ్ధి చేకూరుతుందని పేర్కొన్నారు. కొనుగోలు కేంద్రాల్లో తూకం నుంచి చెల్లింపుల వరకు అంతా పారదర్శకంగా జరుగుతుందని, రైతులు నిర్భయంగా ధాన్యాన్ని తీసుకురావాలని కోరారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కేంద్రాల వద్ద అన్ని వసతులు కల్పించినట్లు తెలిపారు. అధికారులు, సిబ్బంది సమన్వయంతో కొనుగోలు ప్రక్రియను సజావుగా పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ దండి లక్ష్మి, వైస్ చైర్‌పర్సన్ చిత్తారి పద్మ రవీందర్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బంక చందు, డైరెక్టర్లు మడప యాదవ రెడ్డి, బాలయ్య, బొంగోని శ్రీనివాస్, కరెంటోతు రవి, మున్సిపల్ కౌన్సిలర్ కేశవేణి రమేష్, కాంగ్రెస్ నాయకులు ఎండి హసన్, వెన్న రాజు, విద్యాసాగర్, సతీష్, బొమ్మగాని రాజు, వ్యవసాయ అధికారి పూజ, మార్కెట్ సూపర్వైజర్ గంగారాం తదితరులు పాల్గొన్నారు.

# స్వీయ క్రమశిక్షణతోనే రోడ్డు ప్రమాదాల నివారణ...

**సిరిసిల్ల డిఎస్పీ నాగేంద్రచారి**



రాజన్న సిరిసిల్ల (తెలంగాణ వాణి జిల్లా ప్రతినిధి) రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని నేతన్న చౌరస్తాలో పోలీస్ శాఖ మరియు రవాణా శాఖ ఆధ్వర్యంలో రహదారి భద్రతపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించబడింది. ఈ కార్యక్రమం ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా నిర్వహిస్తున్న "అరైవ్ అలైవ్" కార్యక్రమంలో భాగంగా జరిగింది. ఈ సందర్భంగా సిరిసిల్ల డీఎస్పీ నాగేంద్రచారి మాట్లాడుతూ ప్రతి ఒక్కరు స్వీయ క్రమశిక్షణ పాటిస్తే రోడ్డు ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చని తెలిపారు. రహదారిపై ప్రయాణించే సమయంలో చేసే చిన్న పొరపాట్లు ప్రాణాంతక ప్రమాదాలకు దారితీస్తాయని, ట్రాఫిక్ నియమాలు ప్రజల రక్షణ కోసమే ఉన్నాయని అన్నారు. వాహనదారులు తప్పనిసరిగా సీట్‌బెల్ట్ ధరించాలి, హెల్మెట్ ఉపయోగించాలి, మద్యం సేవించి వాహనాలు నడపకూడదని, డ్రైవింగ్ సమయంలో మొబైల్ ఫోన్ వినియోగించరాదని సూచించారు. మైనర్ పిల్లలకు వాహనాలు ఇవ్వకూడదని, అలాంటి ఘటనల్లో తల్లిదండ్రులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రమాదం జరిగిన మొదటి గంటను "గోల్డెన్ అవర్"గా పరిగణిస్తూ ఆ సమయంలో సమయానికి వైద్య సహాయం అందితే ప్రాణాలను రక్షించవచ్చని పేర్కొన్నారు. జిల్లాలో అరైవ్ అలైవ్ కార్యక్రమంలో విస్తృతంగా అవగాహన సదస్సులు నిర్వస్తున్నామని ప్రజలు వాహనదారులు ట్రాఫిక్, రోడ్డు భద్రత నియమాలు పాటిస్తూ పోలీస్ వారికి సహకరించాలని విజ్ఞప్తి చేసారు. జిల్లా రవాణా అధికారి లక్ష్మణ్ మాట్లాడుతూ రహదారి భద్రతను సామాజిక బాధ్యతగా తీసుకుని ప్రతి ఒక్కరు జాగ్రత్తలు పాటించాలని కోరారు. ప్రాణాలు అమూల్యమైనవని, మద్యం సేవించి వాహనాలు నడపడం ప్రమాదకరమని అన్నారు. ఈ కార్యక్రమంలో సిరిసిల్ల పట్టణ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్, ట్రాఫిక్ ఆర్.ఐ సురేష్, ఎస్.ఐ శ్రీకాంత్, ఆర్.ఎస్.ఐ శ్రీనివాస్, ఏఎంవీఐ పృథ్వీధర్, పోలీస్ సిబ్బంది మరియు వాహనదారులు పాల్గొన్నారు.

# ఘనంగా అన్న క్యాంటీన్ ప్రారంభోత్సవం

**హోళగుంద** ఆలూరు నియోజకవర్గ ంలో పట్టణంలో బుధవారం ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా నిలిచే అన్న క్యాంటీన్ ప్రారంభోత్సవం ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఆలూరు టీడీపీ ఇన్‌చార్జ్ వైకుంఠం జ్యోతి , రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ శ్రీ వైకుంఠం శివప్రసాద్ , టిడిపి నాయకులు పాల్గొన్నారు. ఆలూరు ప్రాంత ప్రజలకు 5 రూపాయిలు ధరకే నాణ్యమైన ఆహారం అందించే ఈ అన్న క్యాంటీన్ ప్రారంభం కావడం పట్ల స్థానిక ప్రజలు ఆనందం వ్యక్తం చేశారు. ముఖ్యంగా పేద మరియు మధ్యతరగతి ప్రజలకు ఇది ఎంతో మేలు చేస్తుందని నాయకులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆలూరు ప్రజల తరఫున హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ప్రజల సంక్షేమం కోసం ఇలాంటి సేవా కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయం అని అన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ చైర్మన్ వెంకటేశ్వర్లు టిడిపి ప్రధాన కార్యదర్శి గోవింద్ గౌడ్ చిన్న ఆట శేషగిరి దుర్గయ్య టీడీపీ మరియు కూటమి నాయకులు, కార్యకర్తలు, గ్రామ పెద్దలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

## పాడేరు మొదకొండమ్మ జాతర ఏర్పాట్లు
## పరిశీలించిన మంత్రి గుమ్మడి సంధ్య రాణి.

అల్లూరి పాడేరు గిరిజన దేవత శ్రీ మొదకొండమ్మ అమ్మవారి జాతర సందర్భంగా మే 17, 18, 19 తేదీలలో నిర్వహించనున్న ఉత్సవాల ఏర్పాట్లను మంత్రి గుమ్మిడి సంధ్యారాణి ప్రత్యక్షంగా పరిశీలించారు. జాతరకు వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా తాగునీరు, పారిశుధ్యం, వైద్య సేవలు, ట్రాఫిక్ నిర్వహణ వంటి అన్ని ఏర్పాట్లు సమగ్రంగా చేయాలని అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. జాతర సమయంలో భక్తులకు సురక్షితమైన వాతావరణం కల్పించడం అత్యంత ముఖ్యమని మంత్రి పేర్కొన్నారు. గిరిజనుల ఆరాధ్య దైవమైన మొదకొండమ్మ అమ్మవారి జాతరను ఘనంగా నిర్వహించేందుకు ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని తెలిపారు. అనంతరం పాడేరు పట్టణంలో అన్న కాంటీన్ ను మంత్రి గుమ్మిడి సంధ్యారాణి ప్రారంభించారు. పేదలు, కార్మికులు మరియు సాధారణ ప్రజలకు తక్కువ ధరలో పరిశుభ్రమైన ఆహారం అందించడమే అన్న కాంటీన్ లక్ష్యమని మంత్రి తెలిపారు.

## ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్ 2026లో

# చోటుదక్కించుకున్న చిన్నారి

**- శుభాకాంక్షలు తెలియజేసిన మున్సిపల్ చైర్ పర్సన్ పెండెం శ్రీలక్ష్మీ రామానంద్**

**- మున్సిపల్ కమిషనర్ కాటం భాస్కర్**



నర్సంపేట :ఏప్రిల్ 15(తెలంగాణ వాణి ప్రతినిధి)నర్సంపేట పట్టణం శాంతినగర్ లో నివాసం ఉంటున్న చెన్నారావుపేట మండలం ఉప్పరపల్లికి చెందిన మాజీ సైనికులు చింతకింది శివకృష్ణ - మౌనిక దంపతులకు ముగ్గురు సంతానం కాగా,మొదటి సంతానం కూతురు అక్షర 2020 జూన్ 3న జన్మించింది..రెండవ సంతానం అర్జున్ 2022 జూన్ 3వ తేదీన జన్మించడం జరిగింది..అదేవిధంగా మూడవ సంతానం కుమారుడు ఆదిత్య కూడా 2024 జూన్ 3న జన్మించగా,మీరు ముగ్గురు ఒకే నెల ఒకే తేదీన రెండేళ్ల వివదిలో జన్మించడంతో ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్ 2026లో చోటు సంపాదించుకున్నారు. ఈ సందర్భంగా మున్సిపల్ కార్యాలయం నందు ఇండియన్ బుక్ ఆఫ్ రికార్డ్స్ లో చోటు సంపాదించుకున్న చింతకింది అక్షర , తల్లిదండ్రులను శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేసిన మున్సిపల్ చైర్ పర్సన్ పెండెం శ్రీ లక్ష్మీ రామానంద్ , మున్సిపల్ కమిషనర్ కాటం భాస్కర్ ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్స్ బీరం భరత్ రెడ్డి,పొన్నాల మనిషా ప్రకాష్,శ్రీరామోజు రోజా రాణి,ఇస్లావత్ రమా గోపి,మార్కెట్ కమిటీ డైరెక్టర్ కొల్లూరి మధుకర్,4వ వార్డు అధ్యక్షులు మంచినీళ్ల నాగరాజు,కాంగ్రెస్ పార్టీ యూత్ సభ్యులు కొర్ర రాహుల్,ఉపూల శాలూమ్,దేవోజు హేమంత్,భూక్యా గణేష్,చీకటి శివమణి తదితరులు పాల్గొన్నారు...

# యువత ప్రాణాలు అమూల్యం : సిపి గౌస్ ఆలం

## రోడ్డు భద్రతా నియమాలు తప్పనిసరి

శాతవాహన యూనివర్సిటీలో 'అరైవ్ అలైవ్'అవగాహన సదస్సు కరీంనగర్:ఏప్రిల్ 15:(తెలంగాణ వాణి ప్రతినిది) తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టా త్మకంగా చేపట్టిన 99 రోజుల 'ప్రజా పాలన ప్రగతి ప్రణాళి క'లో భాగంగా బుధవారం కరీంనగర్ జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో స్థానిక శాతవా హన యూనివర్సిటీలో అరైవ్ అలైవ్'రోడ్డు భద్రతా అవగాహ న కార్యక్రమాన్ని నిర్వహించా రు.రెవెన్యూ,మున్సిపల్,మరి యు రవాణా శాఖల సమన్వ యంతో నిర్వహిస్తున్న ఈ రోడ్డు భద్రతా వారోత్సవాల 3వ రోజు కార్యక్రమానికి జిల్లా పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం ముఖ్య అతిథిగా హాజర య్యారు.

**అవగాహనతోనే ప్రమాదాల నివారణ**

**: సిపి గౌస్ ఆలం**

ఈ సందర్భంగా సిపి మాట్లా డుతూ,ఈ నెల 13 నుండి 18 వరకు కమిషనరేట్ వ్యాప్తంగా రోడ్డు భద్రతా వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రోడ్డు ప్రమాదాల్లో అధిక శాతం యువతే ప్రాణాలు కోల్పోవడం ఆందోళనకర మని,దీనిని అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ డిఫెన్సివ్ డ్రైవింగ్ అలవాటు చేసుకోవాలని సూచించారు.

**ముఖ్య అంశాలు:**

మానవ తప్పిదాలే కారణం: హెల్మెట్,సీట్ బెల్ట్ ధరించక పోవడం,డ్రంక్ అండ్ డ్రైవ్, సెల్ ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయడం,అపసవ్య మార్గాల్లో ప్రయాణించడం వల్ల ప్రమాదాలు జరుగుతు న్నాయి. గణాంకాలు:జిల్లాలో గతేడాది 200 మంది రోడ్డు ప్రమాదాల్లో మరణించగా,అందులో ద్విచక్ర వాహనదారులే ఎక్కువ.పోలీసుల కఠిన చర్యల వల్ల ప్రమాదాల రేటు 17 శాతం తగ్గింది.ప్రభుత్వ ప్రోత్సాహం:ఈ పథకం కింద ఎంపిక చేసిన ఆసుపత్రుల్లో రూ. 1.5 లక్షల వరకు ఉచిత నగదు రహిత చికిత్స అందు బాటులో ఉంది.హిట్ అండ్ రన్ బాధితులకు కూడా ఆర్థిక సాయం అందుతుంది.

రహవీర్ పథకం: ప్రమాదం జరిగిన'గోల్డెన్ అవర్'లో బాధితులను ఆసుపత్రికి చేర్చిన వారికి ప్రభుత్వం రూ.25 వేల బహుమతి అందజేస్తుంది.అనంతరం విద్యార్థులకు సైబర్ నేరాలు, డ్రగ్స్ వినియోగం వల్ల కలిగే నష్టాలు మరియు ర్యాగింగ్ నిరోధక చట్టాలపై సిపి అవగా హన కల్పించారు.

**డ్రగ్ ఫ్రీ యూనివర్సిటీగా**

**శాతవాహన:వీసీ ఉమేష్ కుమార్**

యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ యు.ఉమేష్ కుమార్ మాట్లా డుతూ,తమ విద్యాలయ ప్రాంగణం డ్రగ్ ఫ్రీగా ఉందని, ర్యాగింగ్ నిరోధానికి ప్రత్యేక కమిటీ పనిచేస్తోందని తెలిపారు.వాహనాల వేగాన్ని నియంత్రించేందుకు క్యాంపస్ అంతటా స్పీడ్ బ్రేకర్లు ఏర్పా టు చేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో భాగంగా విద్యార్థులతో రోడ్డు భద్రతా నియమాలు పాటిస్తామని ప్రతిజ్ఞ చేయించారు.అనంత రం పలువురు విద్యార్థులకు యూనివర్సిటీ వీసీ ఉచితంగా హెల్మెట్లను పంపిణీ చేశారు.




ఈ కార్యక్రమంలో కొత్తపల్లి స్టేషన్ అధికారి(ట్రైనీ ఐపీఎస్) సోహం సునీల్, ఇన్స్పెక్టర్ బిల్లా కోటేశ్వర్, రిజిస్ట్రార్ సతీష్ కుమార్ మరియు పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదాల నియంత్రణ కోసం

# విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలు

**- మంత్రి పొన్నం ప్రభాకర్**

**నిజామాబాద్** రోడ్డు ప్రమాదాల నియంత్రణ కోసం విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా అరైవ్ అలైవ్ పేరుతో రాష్ట్ర వ్యాప్తంగా అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నామని అన్నారు. అరైవ్ అలైవ్ కార్యక్రమంలో పాల్గొనేందుకు నిజామాబాద్ నగర పర్యటనకు బుధవారం విచ్చేసిన మంత్రి పొన్నం ప్రభాకర్ కు జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి, పోలీస్ కమిషనర్ సాయి చైతన్య, ఇతర అధికారులు ఘన స్వాగతం పలికారు. హెలికాప్టర్ ద్వారా మధ్యాహ్నం మూడు గంటల సమయంలో నిజామాబాద్ చేరుకున్న మంత్రిని సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం హెలిప్యాడ్ వద్ద కలెక్టర్, పోలీస్ కమిషనర్ తో పాటు అదనపు కలెక్టర్ దిలీప్ కుమార్, సబ్ కలెక్టర్లు వికాస్ మహతో, అభిగ్యాన్ మాల్వియ, రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, రాష్ట్ర సహకార యూనియన్ లిమిటెడ్ చైర్మన్ మానాల మోహన్ రెడ్డి, నుడా చైర్మన్ కేశ వేణు, ఇతర జిల్లా అధికారులు పుష్ప గుచ్చాలు అందించి స్వాగతం పలికారు. అక్కడి నుండి పోలీసు బందోబస్తు మధ్య కాన్వాయ్ ద్వారా మంత్రి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల వద్దకు చేరుకున్నారు. అరైవ్ అలైవ్ కార్యక్రమంలో భాగంగా రోడ్డు భద్రతపై అవగాహన కోసం చేపట్టిన బైక్ ర్యాలీని జెండా ఊపి లాంఛనంగా ప్రారంభించారు. ఈ ర్యాలీ కంటేశ్వర్ బైపాస్ చౌరస్తా వరకు చేరుకోగా, అక్కడ విద్యార్థులతో కలిసి మానవహారంగా ఏర్పడ్డారు. జిల్లా అధికారులతో పాటు రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతి రెడ్డి, నగర మేయర్ ఉమారాణి, రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్, ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డి, రాష్ట్ర వ్యవసాయ కమిషన్ సభ్యుడు గడుగు గంగాధర్ తదితరులు మానవహారంలో భాగస్వాములు అయ్యారు. రోడ్డు ప్రమాదాల నియంత్రణకు కృషి చేస్తామని, ట్రాఫిక్ నిబంధనలు విధిగా పాటిస్తామని మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ. అతివేగం, ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘన కారణంగా రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకుని ఎంతో మంది ప్రాణాలు కోల్పోతున్నారని ఆవేదన వెలిబుచ్చారు. తద్వారా అనేక కుటుంబాలు ఇబ్బందులు పడాల్సి వస్తోందని అన్నారు. ఎన్ని చట్టాలు నిబంధనలు అమలు చేసినా, ప్రజలలో మార్పు రానంత వరకు ప్రమాదాలను నిలువరించడం సాధ్యం కాదని అన్నారు. దీనిని గుర్తిస్తూ పోలీస్ రవాణా శాఖల ఆధ్వర్యంలో ప్రజలలో అవగాహన కల్పించడం కోసం అరైవ్ అలైవ్ పేరుతో ప్రభుత్వం విస్తృత స్థాయిలో కార్యక్రమాలు నిర్వహిస్తోందని గుర్తు చేశారు. అన్ని వర్గాల వారు ఈ కార్యక్రమాల్లో పాల్గొని ప్రమాదాల నివారణకు తమవంతు దోహదపడాలని పిలుపునిచ్చారు.

రోడ్డు ప్రమాదాలలో గాయపడిన క్షతగాత్రులను తక్షణమే స్పందించి ఆసుపత్రికి తరలించాలని, అలా కృషి చేసిన వారిని రహ్ వీర్ కింద రూ. 25 వేల నగదు ప్రోత్సాహకం ప్రభుత్వం ద్వారా అందజేయబడుతుందని తెలిపారు. ముఖ్యంగా విద్యార్థులు, యువత వాహనాలు నడిపే సమయంలో తప్పనిసరిగా నిబంధనలు పాటిస్తూ, ప్రమాదాల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని మంత్రి పొన్నం ప్రభాకర్ హితవు పలికారు. ఈ కార్యక్రమాలలో ప్రజాప్రతినిధులు, అధికారులు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

# మట్టిలో మాణిక్యం ఇంటర్ ఫలితాల్లో 986/1000,952/1000

**- సీఏ చేయడం నా ధ్యేయం ఎలిచెర్ల ఓబుల్ రెడ్డి..**

**బ్రహ్మంగారిమఠం** మట్టిలో మాణిక్యాలు దొరుకుతాయి అని మన పెద్దలు చెప్పిన నానుడి నిజం చేశాడు ఈ విద్యార్థి ఎలి చెర్ల ఓబుల్ రెడ్డి బుధవారం ఇంటర్ బోర్డు రిలీజ్ చేసిన ఫలితాలలో 1000 మార్కులకు 986 మార్కులు సాధించి కడప జిల్లాలో ఒక కీర్తి కెరటాన్ని ఎగురవేశారు. గ్రామీణ ప్రాంతమైన అవధూత కాశి నాయన మండలంలోని సావిశెట్టిపల్లె గ్రామంలో ఎలిచెర్ల చంద్ర ఓబుల రెడ్డి వ్యవసాయ రైతు అలాగే ఆయన శ్రీమతి లక్ష్మీదేవి గృహిణి ల కుమారుడు ఎలిచెర్ల ఓబుల్ రెడ్డి ఒకటవ తరగతి నుంచి పదవ తరగతి వరకు బ్రహ్మంగారి మఠం లో ఉన్న వరుణ్ హై స్కూల్ నందు చదువుకొని పదో తరగతి నందు 500కు పైగా మార్కులు సాధించాడు. ప్రస్తుతం ఇంటర్మీడియట్ రెండు సంవత్సరాలు నెల్లూరులోని ఎస్సార్ జూనియర్ కళాశాలలో ఎంపీసీ చదివాడు. మొదటి సంవత్సరంలో 470 మార్కులకు గాను 464 మార్కులు సాధించి కాలేజీ టాపర్గా నిలిచి ఇటు తల్లిదండ్రులతోపాటు అటు ఆధ్యాపక బృందంతో మన్ననలు పొందారు. అలాగే ద్వితీయ సంవత్సరంలో 530 మార్కులకు గాను 522 మార్కులు సాధించాడు.

ప్రథమ, ద్వితీయ సంవత్సరంలో మొత్తం 1000 మార్కులకు గాను 9 86 మార్కులు సాధించి జిల్లాలో టాపర్ గా నిలిచినందుకు ఆటు కాలేజీ ఆధ్యాపక బృందం తల్లిదండ్రులతో పాటు ఈ ప్రాంత ప్రజలు ఆ అబ్బాయిని అభినందిస్తున్నారు. తన కుమారుడు మంచి మార్కులు సాధించినందుకు చాలా సంతోషంగా ఉందని కోరుకుంటున్నాని ఆనందభాష్పాలతో ఆ విద్యార్థి తండ్రి పేర్కొన్నారు. మేమైతే పొలం పనులు చేసుకుంటూ కాయ కష్టం చేస్తూ పిల్లలను చదివిస్తున్నామని అబ్బాయి తండ్రి చంద్ర ఓబుల రెడ్డి పేర్కొనడం విశేషం. నాకు ఇద్దరు అమ్మాయిలు ఇద్దరు అబ్బాయిలు అయితే పెద్దమ్మాయి బిటెక్ చేసి ఉద్యోగం చేస్తోంది

అలాగే రెండో అమ్మాయి కావలిలో బీటెక్ మూడో సంవత్సరం చదువుతోంది చివరివాడైన చిన్నబ్బాయి బ్రహ్మంగారిమఠంలో ఎనిమిదో తరగతి చదువుతున్నాడు ఈ కాలంలో ఇంత మందిని చదివించడం భారమైనప్పటికీ తాను వ్యవసాయ రైతుగా పోరాటం చేస్తున్న పిల్లల కోసం కష్టపడి చదివిస్తున్నానని పేర్కొన్నారు. అలాగే మా పిల్లలందరూ కూడా భవిష్యత్తులో మంచి స్థాయికి ఎదగాలని ఆ భగవంతుని ప్రార్థిస్తూ ఉంటానని ఆయన పేర్కొన్నారు.

986 మార్కులు సాధించిన ఓబుల్ రెడ్డి అనే విద్యార్థి మాట్లాడుతూ తాను చార్టెడ్ అకౌంట్ (సి ఎ) చదవాలని తన చిరకాల కోరిక అని సిఏ లో కూడా తాను ఉన్నతశ్రేణిలో విజయం సాధించి పలువురికి ఆదర్శంగా నిలబడతానని ఆ చిన్నారి విద్యార్థి పేర్కొనడం ఆనందదాయకం ఏది ఏమైనా గ్రామీణ ప్రాంతంలో నుంచి సాధారణ బడ్జెట్ స్కూళ్లలో చదివిన ఈ విద్యార్థి 986 మార్కులు సాధించడం నిజంగా మట్టిలో మాణిక్యమే అని చెప్పక తప్పదని పలువురు పేర్కొంటున్నారు. ఏమైనా ఆ విద్యార్థి భవిష్యత్తు మంచిగా ఉండాలని ఆశిద్దాం...952 మార్కులతో మెరిసిన మరో విద్యార్థి కాశి నాయన మండలం కొట్టాలపల్లి గ్రామానికి చెందిన సాధారణ రైతు ముదుమాల వెంకటరమణారెడ్డి రమాదేవి దంపతుల పెద్ద కుమారుడైన ముదుమాల హేమంత్ కుమార్ రెడ్డి ఇంటర్మీడియట్ ఫలితాలలో 1000 మార్కులకు గాను 952 మార్కులు సాధించి తన సత్తా చాటారు.

ఈ సందర్భంగా ఆ చిన్నారి విద్యార్థి ముచ్చటిస్తూ తాను ఇంజనీరింగ్ లో చేరి ఇంజనీరింగ్ పట్టా పొందిన తర్వాత సివిల్స్ వైపు వెళ్లి మంచి ఉన్నత స్థాయి అధికారిగా వచ్చి ప్రజలకు సేవ చేయడమే తన లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. ఈ అబ్బాయి కూడా బ్రహ్మంగారిమఠంలోని వరుణ్ హై స్కూల్ నందు ఒకటో తరగతి నుంచి చదివి తదుపరి ఇంటర్మీడియట్ నెల్లూరు ఎస్‌ఆర్ కాలేజీలో చదివి మంచి మార్కులు సాధించారు.

గ్రామీణ ప్రాంతం నుంచి వచ్చిన తాము ఏమాత్రం చదువులో వెనుకబడలేదని ఆధ్యాపకులు చెప్పిన ప్రతి అంశాన్ని ఎప్పటికప్పుడు నేర్చుకుంటూ ముందడుగు వేశామన్నారు భవిష్యత్తులో కూడా ఓ పద్ధతి ప్రకారం ఉన్నత స్థాయికి చేరుకునేందుకు కావలసిన అన్ని అంశాలను ఆధ్యాపకుల ద్వారా తెలుసుకొని ముందడుగు వేస్తామని ఆ ఇద్దరు విద్యార్థులు పేర్కొనడం విశేషం...

# రామ్ చరణ్ 'పెద్ది'
# జూన్‌కు వాయిదా..



గ్లోబల్ స్టార్ రామ్ చరణ్, దర్శకుడు బుచ్చిబాబు సానా కాంబినేషన్‌లో వస్తున్న పాన్ ఇండియా చిత్రం 'పెద్ది' విడుదల మరోసారి వాయిదా పడింది. ముందుగా ప్రకటించిన ప్రకారం ఏప్రిల్ 30న విడుదల కావాల్సిన ఈ సినిమాను జూన్ నెలలో రిలీజ్ చేయనున్నట్లు చిత్ర నిర్మాణ సంస్థ వృద్ధి సినిమాస్ బుధవారం అధికారికంగా ప్రకటించింది. సినిమాకు సంబంధించిన టాకీ పార్ట్ మొత్తం పూర్తయిందని, కేవలం ఒక పాట చిత్రీకరణ మాత్రమే మిగిలి ఉందని చిత్రబృందం ఒక ప్రకటనలో తెలిపింది. ఇప్పటికే సినిమా ఎడిట్ ప్రింట్ చూసుకున్నామని, అవుట్‌పుట్ పట్ల చాలా సంతోషంగా ఉన్నామని పేర్కొంది. "ప్రేక్షకులకు అత్యుత్తమ థియేటర్ అనుభవాన్ని అందించాలనేదే మా లక్ష్యం. అద్భుతమైన కంటెంట్‌ను అంతే గొప్పగా ముస్తాబు చేసేందుకు, పోస్ట్ ప్రొడక్షన్, టెక్నికల్ టీమ్స్‌కు మరికొంత సమయం ఇవ్వాలనుకుంటున్నాం. వారి నైపుణ్యంతో సినిమాను పరిపూర్ణంగా తీర్చిదిద్దేందుకే ఈ నిర్ణయం తీసుకున్నాం" అని నిర్మాతలు వివరించారు.

సినిమా పాటలు, గ్లింప్స్‌కు వస్తున్న అద్భుతమైన స్పందనకు ధన్యవాదాలు తెలిపిన చిత్రబృందం, అభిమానుల సహకారానికి కృతజ్ఞతలు చెప్పింది. రామ్ చరణ్ సరసన జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటిస్తున్న ఈ భారీ బడ్జెట్ చిత్రానికి ఏ.ఆర్. రెహమాన్ సంగీతం అందిస్తున్నారు. జూన్‌లో కచ్చితమైన విడుదల తేదీని త్వరలోనే ప్రకటిస్తామని మేకర్స్ స్పష్టం చేశారు.

# రూ. 3000 కోట్ల క్లబ్‌లో
# 'ధురంధర్' ఫ్రాంచైజీ..

## బాహుబలి, పుష్పలను వెనక్కి నెట్టి చారిత్రక రికార్డ్!



బాలీవుడ్ స్టార్ రణ్‌వీర్ సింగ్ నటించిన 'ధురంధర్' ఫ్రాంచైజీ భారత సినీ చరిత్రలో ఒక అరుదైన మైలురాయిని అందుకుంది. రెండు భాగాలుగా వచ్చిన ఈ సిరీస్, ప్రపంచవ్యాప్తంగా బాక్సాఫీస్ వద్ద రూ. 3000 కోట్లకు పైగా వసూళ్లు సాధించిన తొలి భారతీయ ఫ్రాంచైజీగా చరిత్ర సృష్టించింది. ఈ క్రమంలో రాజమౌళి రూపొందించిన 'బాహుబలి', ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ 'పుష్ప' ఫ్రాంచైజీలను అధిగమించడం విశేషం. ట్రేడ్ వర్గాల సమాచారం ప్రకారం 'ధురంధర్' మొదటి భాగం ప్రపంచవ్యాప్తంగా రూ. 1,307.35 కోట్లు వసూలు చేయగా, ఇటీవలే విడుదలై నెల రోజులు పూర్తి చేసుకోబోతున్న 'ధురంధర్: ది రివెంజ్' ఇప్పటివరకు రూ. 1,712 కోట్లకు పైగా రాబట్టింది. దీంతో రెండు చిత్రాల మొత్తం వసూళ్లు రూ. 3,019.35 కోట్లకు చేరాయి. ఇదే సమయంలో 'బాహుబలి' ఫ్రాంచైజీ రూ. 2,438 కోట్లు, 'పుష్ప' ఫ్రాంచైజీ రూ. 2,092.20 కోట్ల వసూళ్లతో తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. ప్రస్తుతం థియేటర్లలో విజయవంతంగా ప్రదర్శితమవుతున్న 'ధురంధర్: ది రివెంజ్' చిత్రం ఒక్కటే 27 రోజుల్లో ప్రపంచవ్యాప్తంగా రూ. 1,727.93 కోట్ల గ్రాస్ వసూలు చేసింది. ఇందులో భారతదేశంలో గ్రాస్ వసూళ్లు రూ. 1,311.68 కోట్లు కాగా, ఓవర్సీస్‌లో రూ. 416.25 కోట్లు ఉన్నాయి. ఈ చిత్రం విడుదలైన తొలి 11 రోజుల్లోనే మొదటి భాగం లైఫ్‌టైమ్ కలెక్షన్లను అధిగమించి సత్తా చాటింది. ఈ ఘనతపై ప్రముఖ ట్రేడ్ విశ్లేషణ సంస్థ శాక్‌నిల్క్ నివేదిక స్పందిస్తూ... "ఈ రూ. 3000 కోట్ల మైలురాయి కేవలం ఒక సంఖ్య కాదు. భారతీయ ఫ్రాంచైజీలను ప్రపంచ వేదికపై చూసే దృష్టికోణంలో వచ్చిన మార్పుకు ఇది సంకేతం. ఇప్పటివరకు భారతీయ సినిమా ఎన్నో బ్లాక్‌బస్టర్లను అందించింది. కానీ, ప్రపంచంలోని అతిపెద్ద ఫిల్మ్ సిరీస్‌లతో పోటీపడగల సత్తా మన కథలకు ఉందని ధురంధర్ నిరూపించింది" అని పేర్కొంది. గల్ఫ్ దేశాలు, చైనాలో విడుదల కాకుండానే ఈ స్థాయి వసూళ్లు సాధించిన తొలి భారతీయ చిత్రంగా కూడా 'ధురంధర్ 2' నిలిచింది. రణ్‌వీర్ సింగ్‌తో పాటు అర్జున్ రాంపాల్, ఆర్. మాధవన్, సంజయ్ దత్ ఈ చిత్రంలో కీలక పాత్రలు పోషించారు.

# 'అనకొండ' మూవీ రివ్యూ!



ప్రపంచవ్యాప్తంగా సంచలనం సృష్టించిన హాలీవుడ్ సినిమాలలో 'అనకొండ' ఒకటిగా కనిపిస్తుంది. అప్పటివరకూ అమెజాన్ ఫారెస్టులో ఉండే 'అనకొండ' అనే పాముల గురించి తెలిసినవాళ్లు చాలా తక్కువనే చెప్పాలి. అందువలన అందరూ ఈ సినిమాను చూస్తూ థ్రిల్ ను ఫీలయ్యారు. దట్టమైన దండకారణ్యంలో అనకొండలు చేసే దాడులను తెరపై చూసిన ప్రేక్షకులు, చాలా కాలం పాటు మరిచిపోలేకపోయారు. ఆ తరువాత 'అనకొండ' నేపథ్యంలో అనేక సినిమాలు వచ్చాయి. అలా క్రితం ఏడాది డిసెంబర్ లో థియేటర్లలో అడుగుపెట్టిన ఈ సినిమా, 'నెట్ ఫ్లిక్స్'లో తెలుగులోను అందుబాటులోకి వచ్చింది. డగ్ (జాక్ బ్లాక్) వివాహ వేడుకలకు సంబంధించిన వీడియోలు చేస్తూ ఉంటాడు. భార్య మాలీ .. కొడుకు ఛార్లీతో అతని లైఫ్ హ్యాపీగా సాగిపోతూ ఉంటుంది. అలాంటి పరిస్థితులలోనే చిన్ననాటి స్నేహితులైన గ్రిఫ్ (పాల్ రడ్) కెన్నీ (స్టీవ్ జాన్) క్లైర్ (తాండివే న్యూటన్) కలుస్తారు. మాటల సందర్భంలో 'అనకొండ' సినిమాను గురించిన ప్రస్తావన వస్తుంది. అలాగే చిన్నతనంలోనే నటన .. డైరెక్షన్ పట్ల తాము చూపిన ఉత్సాహాన్ని వాళ్లు గుర్తుచేసుకుంటారు. 'అనకొండ' సినిమాను తాము రీ బూట్ చేస్తే బాగుంటుందని భావిస్తారు. అమెజాన్ ఫారెస్టుకి వెళ్లి షూటింగు చేసుకుని వద్దామని 'గ్రిఫ్'తన మనసులోని మాటను చెబుతాడు. అమెజాన్ ఫారెస్టు నేపథ్యంలో కథను తయారు చేసే బాధ్యతను ఒకరు .. నిర్మాణానికి అవసరమైన ఖర్చును భరించేది ఒకరు .. దర్శకత్వం చేసేది ఒకరు అంటూ, ఎవరెవరు ఏ పని చేయాలనే విషయంలో పూర్తి క్లారిటీకి వస్తారు. సినిమాకి అవసరమైన అనకొండ పాము కోసం, కార్లోస్ ను సంప్రదిస్తారు. అదే వృత్తిగా జీవిస్తున్న కార్లోస్ ఒక చిన్నపాటి అనకొండతో బయల్దేరడానికి తాను సిద్ధమని చెబుతాడు. మూడు వారాలలో షూటింగును పూర్తిచేసుకుని రావాలనే ఉద్దేశంతో అంతా కలిసి అమెజాన్ ఫారెస్టుకి బయల్దేరతారు. అయితే బోట్ నడిపే యువతిగా వారికి 'అనా' పరిచయమవుతుంది. వాళ్లతో కలిసి ఆమె కూడా ముందుకు సాగుతుంది. అమెజాన్ ఫారెస్టు ప్రాంతంలో అక్కడ లభించే బంగారం విషయంలో రెండు గ్యాంగ్ ల మధ్య వార్ జరుగుతూ ఉంటుంది. అందులో ఒక ముఠాకి చెందిన యువతియే 'అనా'. డగ్ బృందంతో కలిసి ముందుకు వెళు తున్న ఆమె కోసం శత్రువులు గాలిస్తూ ఉంటారు. ఈ నేపథ్యంలోనే షూటింగు కోసం తీసుకెళ్లిన 'అనకొండ' పాము ప్రమాదవశాత్తు చనిపోతుంది. దాంతో అడవిలోని అనకొండనే తీసుకొస్తానని కార్లోస్ వెళతాడు. అప్పుడు ఏం జరుగుతుంది? నిజమైన అనకొండ కారణంగా వాళ్లకి ఎలాంటి పరిస్థితి ఎదురవుతుంది? అనేది కథ. మొదటి సారిగా వచ్చిన 'అనకొండ' ఆడియన్స్ ను ఒక రేంజ్ లో థ్రిల్ చేసింది. ఆ తరువాత అదే తరహా కంటెంట్ తో చాలా సినిమాలు వచ్చినప్పటికీ, ఆ స్థాయిలో ప్రేక్షకులను అలరించలేకపోయాయి. ఆ నేపథ్యంలో వచ్చిన సినిమానే ఇది. చిత్రంలోని ప్రధానమైన తారాగణం అమెజాన్ అడవులకు వెళ్లడం .. అక్కడ అనకొండల కారణంగా వాళ్లకి ఎదురయ్యే అనుభవాలతో ఈ కథ నడుస్తుందనే విషయం ప్రేక్షకులకు ముందుగానే అర్థమైపోతుంది. అనకొండ సినిమా మొదలైన దగ్గర నుంచి, ఫారెస్టుకి ఈ బృందం ఎప్పుడు చేరుకుంటుందా అనే కుతూహలంతోనే ఆడియన్స్ వెయిట్ చేయడం మొదలుపెడతారు. అనకొండపై సినిమా తీయడానికి మిత్ర బృందం అమెజాన్ అడవులకి బయల్దేరడంతో అసలు కథ మొదలవుతుంది. ఇక ఆ అడవిలో బంగారం కోసం అన్వేషించే ముఠాలు, వారి మధ్య సాగే పోరాటం ఈ కథకి సమాంతరంగా నడుస్తూ ఉంటుంది. అమెజాన్ అడవులకు షూటింగు కోసం తెచ్చిన చిన్నపాటి అనకొండ స్థానంలోకి, నిజమైన భారీ అనకొండ వచ్చి చేరడంతో కథ కీలకమైన దశకి చేరుకుంటుంది. ఇక అక్కడి నుంచి ప్రేక్షకులు ఎదురుచూసే దిశగా ఈ కథ కదులుతుంది. కానీ వాళ్లు ఆశించిన స్థాయిలో ముందుకు వెళ్లలేకపోయింది. ఏ స్థాయిలోను ఆడియన్స్ ను మెప్పించలేకపోయింది. ఉత్కంఠను రేకెత్తించే సన్నివేశాలు ఎక్కడా కనిపించవు.

అనకొండ వెంటాడే దృశ్యాలు కూడా అంతగా ఇంపాక్ట్ చూపలేకపోయాయి. అసలు కథను మొదలు పెట్టడానికే అరగంట సమయం తీసుకున్నారు. ఈ అరగంటలో జరిగే కథ కూడా అనవసరమైన సంభాషణలతో .. అర్థం లేని కామెడీతో నడుస్తుంది. అనకొండకంటే ఎక్కువగా ప్రేక్షకులను భయపెట్టేది ఈ కామెడీనే. ఇక అమెజాన్ అడవులకు చేరుకున్న తరువాతనైనా కథ కాస్త గాడిలో పడుతుందేమోనని అనుకుంటే, స్క్రిప్ట్ అనేది లేకుండా అక్కడికక్కడ .. అప్పటికప్పుడు అనుకుని షూట్ చేశారేమో అనిపించకమానదు. కథ .. కథనం .. ఫొటోగ్రఫీ .. నేపథ్య సంగీతం .. గ్రాఫిక్స్ .. ఇలా వీటిని గురించి మాట్లాడుకోవడానికి పెద్దగా ఏమీ లేదు. తెరపై పాత్రలు చేసే హడావిడి తప్ప మరేమీ లేదు. కథ లేకపోవడం వల్లనే కాలక్షేపం చేస్తున్నారనే విషయం ప్రేక్షకులకు అర్థమైపోతూనే ఉంటుంది. ఏ మాత్రం కథపై దృష్టి పెట్టని కంటెంట్ గా ఈ సినిమా మిగిలిపోతుందని చెప్పొచ్చు. ఇకపై తెరపై అనకొండను చూస్తే కాదు, ఈ పేరు వింటేనే భయపడేలా చేశారని చెప్పాలి.

## టాలీవుడ్‌లో
# సమ్మె సైరన్
## - మే 1 నుంచి థియేటర్ల బంద్‌కు సిద్ధం



తెలుగు సినీ పరిశ్రమలో నిర్మాతలు, ఎగ్జిబిటర్ల (థియేటర్ యజమానులు) మధ్య నెలకొన్న వివాదం తీవ్రరూపం దాల్చుతోంది. ఆదాయంలో వాటా (రెవెన్యూ షేరింగ్) విషయంలో ఇరు వర్గాల మధ్య సయోధ్య కుదరకపోవడంతో మే 1వ తేదీ నుంచి తెలంగాణ వ్యాప్తంగా సింగిల్ స్క్రీన్ థియేటర్లను నిరవధికంగా మూసివేయాలని ఎగ్జిబిటర్ల సంఘం నిర్ణయించింది. ఈ నిర్ణయంతో సమ్మర్ సీజన్‌లో విడుదల కావాల్సిన పలు క్రేజీ సినిమాల భవిష్యత్తు అగమ్యగోచరంగా మారింది. ప్రస్తుతం ఉన్న రెంటల్ పద్ధతి వల్ల తాము తీవ్రంగా నష్టపోతున్నామని థియేటర్ల యజమానులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పెరిగిన నిర్వహణ ఖర్చులు, ఓటీటీల ప్రభావంతో ప్రేక్షకుల సంఖ్య తగ్గడంతో థియేటర్లు నడపడం కష్టంగా మారిందని వారు చెబుతున్నారు. అందుకే, మల్టీప్లెక్స్‌ల తరహాలో వసూళ్లలో మొదటి వారం 60 శాతం రెండో వారం 50 శాతం, మూడో వారం 40 శాతం వాటా ఇచ్చేలా కొత్త రెవెన్యూ షేరింగ్ విధానం అమలు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. అయితే, ఈ ప్రతిపాదనను యాక్టివ్ తెలుగు ఫిల్మ్ ప్రొడ్యూసర్స్ గిల్డ్ వ్యతిరేకిస్తోంది. ఇప్పటికే నిర్మాణ వ్యయాలు విపరీతంగా పెరిగాయని, ఈ సమయంలో రెవెన్యూ షేరింగ్ విధానం అమలు చేస్తే నిర్మాతలు మరింతగా నష్టపోతారని వారు వాదిస్తున్నారు. ఏప్రిల్ 30లోగా ఈ సమస్య పరిష్కారం కాకపోతే సమ్మె ఖాయమని ఎగ్జిబిటర్లు స్పష్టం చేశారు. ఒకవేళ సమ్మె జరిగితే మే నెలలో విడుదల కావాల్సిన నిఖిల్ 'స్వయంభూ', సమంత 'మా ఇంటి బంగారం', 'కొరియన్ కనకరాజు', 'సూర్య కరుప్పు' వంటి చిత్రాలపై తీవ్ర ప్రభావం పడనుంది. ఈ వివాదానికి త్వరగా ముగింపు పలకాలని పరిశ్రమ వర్గాలు ఆశిస్తున్నాయి.

## విష్ణుప్రియకు కాసులు
## కురిపించిన వివాదం..

డిజిటల్ మీడియా యుగంలో నెగెటివ్ పబ్లిసిటీ కూడా ఒక్కోసారి పాజిటివ్ ఫలితాలను ఇస్తుందనడానికి తాజా ఉదాహరణగా నిలుస్తున్నారు బుల్లితెర నటి, బిగ్‌బాస్ ఫేమ్ విష్ణుప్రియ భీమినేని. అశ్లీల కంటెంట్‌ను ప్రోత్సహిస్తున్నారంటూ ఆమెపై నమోదైన పోలీస్ కేసు, నైతికంగా ఆమెను ఇబ్బంది పెట్టాలనే లక్ష్యంతో చేసినప్పటికీ, ఆర్థికంగా మాత్రం ఊహించని రీతిలో కలిసొచ్చింది. ఈ వివాదం కారణంగా ఆమె నెలవారీ ఆదాయం ఏకంగా రూ.11 లక్షలకు పైగా పెరగడం ఇప్పుడు సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారింది. విష్ణుప్రియ తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో ప్రత్యేకమైన వీడియోల కోసం నెలకు రూ.399 చొప్పున సబ్‌స్క్రిప్షన్ ఫీజు వసూలు చేస్తున్నారు. ఆమెపై విజయవాడ సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు అందకముందు, ఆమెకు 1,892 మంది సబ్‌స్క్రైబర్లు ఉండేవారు. దీని ద్వారా ఆమెకు నెలకు సుమారు రూ.7.18 లక్షల ఆదాయం వచ్చేది. అయితే, ఎప్పుడైతే ఆమెపై ఆల్ ఇండియా స్టూడెంట్స్ ఫెడరేషన్ (ఏఐఎస్‌ఎఫ్) నేతలు ఫిర్యాదు చేశారో, ఈ వార్త మీడియాలో ప్రముఖంగా ప్రసారమైంది. దీంతో ఆమె అప్‌లోడ్ చేసే కంటెంట్‌లో ఏముందో చూడాలనే ఆసక్తి నెటిజన్లలో ఒక్కసారిగా పెరిగింది. ఫలితంగా, కొద్ది రోజుల్లోనే ఆమె సబ్‌స్క్రైబర్ల సంఖ్య 4,832కు చేరింది. తద్వారా ఆమె నెలవారీ ఆదాయం ఇప్పుడు రూ.18.36 లక్షలకు పైగా చేరింది. అంటే, కేవలం ఈ వివాదం వల్ల ఆమె సంపాదనలో రూ.11 లక్షలకు పైగా పెరుగుదల కనిపించింది. శనివారం విజయవాడ సూర్యారావుపేటలోని సైబర్ క్రైమ్ పోలీసులకు ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం. సాయికుమార్ ఫిర్యాదు చేశారు. విష్ణుప్రియ డబ్బుల కోసం యువతను తప్పుదోవ పట్టించేలా అర్ధనగ్న వీడియోలు పోస్ట్ చేస్తున్నారని, ఆమె ఇన్‌స్టాగ్రామ్ ఖాతాను తక్షణమే బ్లాక్ చేయాలని డిమాండ్ చేశారు. సమాజానికి ఆదర్శంగా ఉండాల్సిన సెలబ్రిటీలు ఇలాంటి పనులు చేయడం సరికాదని వారు విమర్శించారు.

## 'టాక్సిక్' వాయిదాపై క్లారిటీ.. పుకార్లకు చెక్ పెట్టిన చిత్రం యూనిట్



రాకింగ్ స్టార్ యశ్ కథానాయకుడిగా నటిస్తున్న పాన్-ఇండియా చిత్రం 'టాక్సిక్: ఎ ఫెయిరీ టేల్ ఫర్ గ్రోన్-అప్స్' విడుదల మళ్ళీ వాయిదా పడిందంటూ సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారాన్ని చిత్రం బృందం తీవ్రంగా ఖండించింది. ముందుగా ప్రకటించినట్టుగానే జూన్ 4, 2026న సినిమా కచ్చితంగా ప్రేక్షకుల ముందుకు వస్తుందని స్పష్టం చేసింది. ఈ మేరకు జరుగుతున్న ప్రచారంలో ఎలాంటి నిజం లేదని, అభిమానులు ఆందోళన చెందవద్దని కోరింది. గీతూ మోహన్‌దాస్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమా పోస్ట్-ప్రొడక్షన్ పనులు శరవేగంగా జరుగుతున్నాయని చిత్రం యూనిట్ తెలిపింది. ఈ వదంతులకు చెక్ పెడుతూ, హీరో యశ్ ప్రస్తుతం అమెరికాలో ఉన్నారు. లాస్ వెగాస్‌లో జరుగుతున్న ప్రతిష్ఠాత్మక 'సినిమాకాన్' ఈవెంట్‌లో ఆయన పాల్గొని, 'టాక్సిక్' అంతర్జాతీయ ప్రమోషన్లను ప్రారంభించారు. ఈ పర్యటనలో యశ్ 'టాక్సిక్'తో పాటు తాను నటిస్తున్న మరో భారీ చిత్రం 'రామాయణ' ప్రమోషన్ల బాధ్యతలను కూడా చూసుకుంటున్నారు. నితీశ్ తివారీ దర్శకత్వంలో రూపుదిద్దుకుంటున్న 'రామాయణ'లో యశ్ రావణుడి పాత్ర పోషిస్తున్న సంగతి తెలిసిందే. ఒకవైపు 'టాక్సిక్' విడుదల పనులు, మరోవైపు 'రామాయణ' ప్రమోషన్లతో యశ్ బిజీగా గడుపుతుండటంతో, వాయిదా వార్తలకు బలం లేదని స్పష్టమవుతోంది.

Printed, Published & Owned by JERIPOTHULA SAMPATH, Printed at SRI BALAJI, H.No. 4-4-85, Tilak road, District Karimnagar. 505 001 (T.S)Published at H.No. 3-6-307, Subhash Nagar, Karimnagar MDI: District, Karimnagar -505 001 (T.S) Editor: JERIPOTHULA SAMPATH, RNI NO. APTEL/2012/53127 CELL:9912758107, telanganavanil@gmail.com